

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2012

సంపుటి : 18 205 సంచిక : 1




## సమాజం స్వప్రయోజికుల చేతుల్లో బందీ అయింది!

దేశాన్ని తీర్చిదిద్దవలసినవారు, దేశాన్ని కబళిస్తున్నారు. సమాజం అంటే ప్రజలు, సమరీతుల్లో శిరమూ, అందు రెండు కళ్లు ఇరుప్రక్కలా రెండు చెవులూ వాటి మధ్య ఒకే ముక్కు, దానిక్రింద నోరూ, నోటిలో నాలుకా, రెండు చేతులూ, రెండు కాళ్లూ, వీటిని అంటుకుని ముందు హృదయం, ఉదరం, వెనుక వెన్నెముక వంటి సమస్త అవయవములూ అందరికీ ఒకేవిధంగా ఉండేట్టు భగవంతుడు మనుష్యులను సృష్టించాడు. కానీ వీళ్లయందు కొందరికి నాలుకకు దురుసుతనాన్నీ, మనస్సుకు దోపిడీతనాన్నీ, స్వప్రయోజనత్వం అనేవి లక్షణాలు జనించడం, పెరగడం సమాజానికి పీడగా పరిణమించింది.

సమాజం స్వప్రయోజనపరుల పిడికిటలో బందీ అయింది. ఆ పిడికిటను విప్పార్చి బయటపడవేయడం అంత సామాన్య విషయం కాదు. ఎంతో సత్యసంధత, ధర్మశీలం, నైతిక శక్తి, సమైక్యతా, సాహసం, దైవబలం కావాలి.

ఇలాటి స్వప్రయోజనపరులు దేశంలోని రాజకీయ పక్షాల్లోనే ఎక్కువగా ఉన్నారు. ఎంత అలజడి సృష్టిస్తే, వారంతటి నాయకు లౌతున్నారు. దేశాన్ని దోచుకుంటున్నారు. ఇలాటి వారిని దూరం చేయగల శక్తీ, ఎదుర్కోగల శక్తీ ఒక మహాత్ములలోనే ఉంటుంది. ఓ రాముడూ, ఓ కృష్ణుడూ, ఓ బుద్ధుడూ, ఓ శంకరాచార్యుడూ, ఓ రామానుజాచార్యుడూ, ఓ విద్యారణ్యస్వామి వంటి వారు తిరిగిపుడితే వారినెదుర్కోగలరు!

మన చరిత్ర, మన పూర్వీకమూ పరమ పవిత్రమైనది. వ్యాసుడెన్నో పురాణాల ద్వారా దైవత్వాన్నీ, ధర్మాన్నీ మనకందించాడు. వ్యాసోనారాయణో హరిః అన్నారు. వ్యాసుడు భగవదాంశతో పుట్టాడు. ఆయనిచ్చిన వేదసంపద, భగవద్భక్తిపరమైన పావన చరిత్రలెన్నిటినో మనకు జ్ఞానసంపదగా అందచేశాడు. సృష్టి స్థితులకు మూలమూర్తులైన 38 ప్రజాపతులను మనకు వివరిస్తూ, వారి వారి పోషణా విధానాలను, వారి పేర్లతో సహా విశదపరిచాడు.

వేదములనంత సత్య విజ్ఞానసారములైనట్లే భగవంతుడే సత్యస్వరూపుడు. అట్టి సత్యస్వరూపుణ్ణి దర్శించడానికి ఋషులెన్నో తపస్సులు చేశారు. భగవద్దర్శనం పొందారు. భగవంతుడంటే జ్ఞానం. ఎవరికీ కనపడడు. కానీ, అన్నీ ఆయన కల్పనలే!

స్వప్రయోజనపరులకు భగవంతునితో పనిలేదు. వారు వృక్షానికి పట్టిన చీడవంటివారు. మహాత్ములు, మహర్షులేర్పరచిన ఆచారాలనూ, సాంప్రదాయాలను దిగమ్రింగి, త్రేన్పుగానైనను విడువరు. ఇలాటివారే మన దేశంలో ఎక్కువగా ఉన్నారు.

**నరునికి అన్నం తినడం నేర్పింది వేదం. ఆ అన్నాన్ని ప్రసాదంగా భావించినవాడు జ్ఞానవంతుడవుతాడు. అన్నం, వస్త్రం, కుటుంబం, బంధుత్వం, మిత్రత్వం, గ్రామం, రాజ్యం, పాలన - వీటన్నిటినీ వేదమే వివరించింది.**

అన్నపూర్ణ వంటి దేశంలో అన్నపీడితులు, రత్నగర్భ వంటి దేశంలో ఐశ్వర్యాన్ని పంచే వనరులున్నాయ్. దానికి బదులు 'దారిద్ర్యమే దర్శనమిస్తున్నదంటే సమాజం స్వప్రయోజికుల చేతుల్లో బందీ అయింది. ఆ స్వప్రయోజకుల్ని చేధించడానికి బలమైన చట్టాలు కావాలి. ఆ చట్టాల్ని అమలుచేసేం దుకు ధీమంతులైన నాయకులు కావాలి. కానీ, వారేరి? కనపడ డంలేదే? వారికోసం మనం సత్య ధర్మనిష్టలతో అన్వేషణ సాగిద్దాం.



బుధజన విధేయుడు

**గోటేటి శ్రీరామారావు**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# నీకూ నాకూ చెరిసగం పానక ప్రసాదమని యిచ్చే మంగళగిరి పానకాలరాయుడు!



**108** వైష్ణవ క్షేత్రాల్లో ఓ విచిత్రమైన పవిత్ర క్షేత్రం మంగళగిరి. ఈ క్షేత్రం విజయవాడ గుంటూరు రహదారిలో ఇరు నగరాలకు మధ్యన ఓ ఎత్తైన కొండపై ఉన్నది. కొండ దిగువ, కొండపైన అహోబిలంలో వలె నృసింహ ఆలయాలున్నాయ్. ఈ క్షేత్రంలో కొండపైనున్న నృసింహస్వామిని పానకాలస్వామి యని పిలుస్తారు. ఈ స్వామికి భక్తులు ప్రధానంగా పెట్టే నైవేద్యం బెల్లపు పానకం. చెంబునుంచీ బిందెవరకూ నిండుగా పానకం తయారుచేసి (కొండమీదే పానకం తయారుచేసుకునే అవకాశమున్నది) ఎవరి శక్తికి తగినట్టు వారు పెద్ద పెద్ద చెంబులూ, బిందెలతో నిండుగా పానకం తెచ్చి, స్వామివారికి నివేదనం చేసి, తెరుచుకున్న స్వామివారి నోట్లో పోస్తారు.

విచిత్రమేమిటంటే స్వామి వారు భక్తులు తెచ్చిన బిందెలోని పానకం సగం మాత్రం స్వీకరించి, మిగతా సగం పానకాన్నీ ప్రసాదంగా భక్తలకు **నాకో సగం నీకో సగం** అన్నట్లుగా తిరిగి ఉంచేస్తారు. ఎంత చిన్న బిందెతో తెచ్చినా, ఎంత పెద్ద బిందెతో తెచ్చినా అలాగే సగం పానకం భక్తులకు యిచ్చేస్తారు. రోజూ వందల కొద్దీ భక్తులు బిందెలతో పానకం తెస్తారు. అందరికీ అలాగే జరుగుతుంది. అయితే అన్ని సగం బిందల పానకమూ స్వామివారి నోట్లోంచి ఎక్కడకు వెడుతుందో ఎవరికీ ఇన్ని సంవత్సరాలైననూ అంతుబట్టలేదు. ప్రక్కన తూములూ, కాలువలూ వంటివేమైనా ఉన్నాయా అంటే అవేఁవీ లేవు.

మరో విచిత్రమేమంటే, రోజూ ఎంతోమంది భక్తులు బెల్లం తెచ్చి దంచి నీళ్లలో కలిపి పానకం తయారుచేసుకుంటారు. శుభ్రం చేయరు. అక్కడ ఒక్క చీమకానీ, ఈగకానీ వాలకపోవడం, స్వామివారి మహాత్మ్యమే! ఈ విశేషం మరెక్కడా లేదు! ●

# పొంగడం మాని ఆ'తేమ'ను ప్రేమగా మార్చుకోవాలి!

వేసవి సెలవులకని అమల అమ్మమ్మ ఊరికెళ్లింది.

పొయ్యిమీద వంట చేస్తున్న అమ్మమ్మ దగ్గర కూర్చుని వింతగా చూస్తోంది.

అమ్మ ఎప్పుడూ గ్యాస్ స్టవ్ మీద వంట చేస్తుంటుంది.

అమ్మమ్మ కట్టెల పొయ్యి మీద వంట చేస్తోంది.

అన్నం ఉడుకుతున్న పాత్ర మూత తీసేసి ఉంది.

'అదేమిటి అమ్మమ్మా మూత పెట్టవెందుకు?' అడిగింది అమల.

'పొంగు రాకుండా తల్లీ'

'మరి ప్రెజర్ కుక్కర్‌కి మూత ఉంటుందిగా'

'మీ నగరాల్లో జీవితాలు ప్రెజర్‌తోనే ఉడుకుతాయిరా తల్లీ' అని నవ్వింది అమ్మమ్మ.

'మరిక్కడ?'

'పొంగొచ్చినప్పుడు ఊదితే చాలు పొంగు ఆరిపోతుంది'

అమ్మమ్మ చెప్పిన మాట ఎంత నిరాడంబరంగా ఉన్నా ఎంతో గొప్ప సత్యాన్ని చెప్పింది!

సిటీ లైఫ్‌లో మనమెంత ప్రెషర్‌కు గురవుతాం!

ప్రతి చిన్న విషయానికి బుసలు కొడుతూ ఒకరిమీద ఒకరం పడతాం.

ఈ కోపం పొంగు చల్లారాలంటే మూత తీసేయాలి.

అంటే మన మనసులో ఉన్న మాట దాచిపెట్టుకోకుండా ఎప్పటికప్పుడు చెప్పేసుకోవాలి. అప్పుడు ప్రెషరే ఉండదు.

రెండో విషయం... ఒకవేళ కోపం మూత తీసిన తర్వాత కూడా పొంగు బుస కొడుతుంటే... ప్రేమతో ఊదితే చాలేమో, కోపం ఆరుతుంది. ప్రేద ఉడుకుతుంది.

పొంగే ఎసరును వదిలేస్తే అన్నం ఉడకడం మాని మాడుతుంది. అదే ఎసరును పొంగకుండా వాడుకుంటే అన్నం చక్కగా ఉడుకుతుంది.

జీవితంలో ఉడికించే విషయాలెన్నొచ్చినా పొంగడం మాని ఆ తేమను మనలో ప్రేమలా ఇగుర్చుకోవాలి. ఏమంటారు....?

అంటారు ప్రఖ్యాత రామ్ (సాక్షి) సాక్షీభూతుడు. ●

# శ్రీ వేంకటేశ్వరా!



– యస్. మునిసుందర, తిరుపతి

ఒక పాట పాడినది అతివ అలమేల్మంగ
విభుని పదముల చెంత తాను పల్లవిగా ॥

నెనరు నగవుల కొనలు సరిగమలు పలుక
చిగురు సొబగుల వొగరు రాగమై కులుక
వీణతంత్రులు మేటి వేణువై కురిసినది
స్వామి గుండెలలో తల్లి రసగంగలైనది... ఒకపాట...

కమలాక్షి కనులె కోటి స్వరములై చిలుక
కమలనాభుని ఎడద గాంధర్వమై పొంగ
కలికిగళమున స్వామి కాంతి గంధము కురియ
మనసయిన మగనికి పాట వినిపించెను మంగ... ఒక పాట...

సరిగమల తిరుగిరులు గమకములు కాగ
మధురిమల మోహనై విందు చేసెను మంగ
రాముడా? కృష్ణుడా? కోనేటిరాయుడా?
శోభరాగార్చనతో శోభనుడు శోభిల్లె... ఒక పాట...

**SRI RAJARAJESWARI JEWELLERY**

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# కాయకూరలు కోసుకునే కత్తితో కుత్తుకలు కోసుకుంటున్నారు!!

భారతీయతలో నిత్య నైమిత్తికతలో ఆధ్యాత్మికత అనేది మూలభాగం. వ్యక్తిగత సౌశీల్యం జాతీయ సౌశీల్యం, సేవానిబద్ధత, మాతృదేశం పట్ల ప్రేమ కరువవడం, త్యాగభావం శూన్యమవడం, కలుపుగోలుతనమనేది కనుచూపు మేర లేకపోవడం ఇవన్నీ భారతీయతను తూట్లు పొడిచాయ్.

స్వాతంత్రావతరణంతో బాటు దేశ విభజనను తూర్పు పశ్చిమ - పాకిస్తాన్ అనే ఘోరకలితో దేశానికి పట్టిన పీడ పోకుండా, కాశ్మీర్ కల్లోలం రావణకాష్టంవోలె కాలుతూనే ఉన్నది. ప్రక్క దేశాల్నుంచీ ముస్లిములు వలస వచ్చి హిందువులు ఏరివేతతో కాశ్మీరం కల్లోల కలికి అయింది.

ఏకత్వానుభావానుభూతి మనలో కరువవ్వడం, ఎంతసేపూ విడిపోదాం, విడిపోదాం అన్న బీజాలు ప్రతీ ఒక్కరి హృదయంలో పొడసూపడం ఈ దేశానికి పట్టిన ప్రధాన దోషం. దీనికి ప్రధాన కారణం ఉమ్మడి కుటుంబాల విచ్ఛిత్తి. దేశభక్తి, పాపభీతీ లేకపోవడం, స్వార్థం పెరిగిపోవడం చూస్తూంటే ఒక్కొక్క దోషానికి మరొక్క దోషం బాంధవ్యం కలుపుకుంటూ పోతున్నది.

దేశపూర్వకాలంలో అక్షరజ్ఞానం లేని వారెక్కువగా ఉన్నప్పటికీనీ, రామాయణ, భారత భాగవతాది పురాణాలసారమంతటినీ వంట బట్టించుకునేవారు. ప్రతీ మనిషిలోనూ కలిసికట్టు భావనం అధికంగా ఉండేది. గ్రామాల్లో అయితే వేకువజామునే సామూహికంగా పాడుకుంటూ నగర సంకీర్తనంతో దినచర్య ప్రారంభమయ్యేది. దినకరుడు రావడానికి ముందే ముదితలు ఇంటి శుభ్రతనూ వాకిట ముంగిటా, వెనక పెద్ద పెద్ద దొడ్లు ఉండేవి) శుభ్రతల్ని చేసుకుంటూ, ఇరుగు పొరుగులు మంచీ చెడులు మాట్లాడుకోవడం ఉండేది. నిద్రలేచింది మొదలు నిద్రపోయే వరకూ ప్రక్క ఇంటివారితో ఏవో సంభాషణలు సాగుతూండేవి. వ్రతాలూ, పూజలూ, పండుగలూ పబ్బాలకు ఒకరినొకరు పిలుచుకోవడం ఉండేది. ప్రతీ గ్రామానికీ కనీసం రెండు ఆలయాలూ, గ్రామదేవత ఆలయం విధిగా ఉండేది. ఉదయం మగవాళ్ళూ, సాయంత్రం మహిళలూ, పిల్లలూ వెళ్ళేవారు. పిల్ల వయసు నుంచే దైవభక్తి పిన్న మనసుల్లో ఏర్పడేది. తల్లితండ్రులు కూడా తమ పిల్లలకు రామాయణ భారత కథలనూ, నీతి కథలనూ, నీతి శతక పద్యాలనూ చెప్పి వళ్లె వేయించేవారు. చేతికున్న ఐదువేళ్లలా అందరూ కలిసి ఉండాలనీ, దైవభక్తీ, సత్యం మాట్లాడడమూ, ధర్మంగా నడుచుకోవడం, త్యాగభావం అలవరచుకోవడం అవసరమని బోధించేవారు. విభిన్న మతాలవారు కూడా వారి వారి దైవాలను, వారి వారి ప్రార్థనామందిరాల్లో ప్రార్థించుకున్ననూ, కష్టసుఖాల్లో ఒకరికొకరు సహకరించుకొనేవారు. దేశ క్షేమాన్నే కోరుకునేవారు. అందుకే మన దేశంలో త్యాగమూర్తులూ, దేశభక్తులైన మహనీయులు పుట్టారు.

దేశం సమైక్యంగా, సమున్నతంగా తీర్చిదిద్దడానికి సత్య ధర్మ, త్యాగ నిబద్ధతలను ఆచరించి, ప్రజలకు నేర్పారు. ఏకదేశంగా ఏకనాదంగా ప్రజలు కలిసి మెలసి ఉండాలని ఆనాటి నాయకులు భావించారు. ఎవరి భాషా ప్రియత్వం వారికుండేది, అన్యభాషా బేధం ఉండేది కాదు.

సదుద్దేశంతో భాషాపరంగా రాష్ట్రాలు ఏర్పడితే, వారి వారి రాష్ట్రాలను, భాషా సంస్కృతులను అభివృద్ధి చేసుకోవచ్చునని భావించిన వారు తెలుగువారే! కానీ నెహ్రూ, పటేల్ ప్రభృతులు భాషాపరంగా రాష్ట్రాలు విడిపోవడానికి అంగీకరించలేదు. దేశ సార్వభౌమత్వానికీ, సమైక్యతా సమగ్రతలకు భంగం కలుగుతుందని భావించారు.

కాయకూరలు కోసుకునే కత్తితో, కుత్తుకుల్ని కోసుకొనే ప్రమాదం ఉంటుందని తెలుగు నాయకులు భావించలేదు. కౌరవ పాండవులు కుమ్ముకున్నట్లు దాయాదుల పగ, ద్వేషములు ప్రబలతాయని తలంచలేదు. తెలుగు తమిళ భాషా తగవులొక ప్రక్కన ఉంటుంటే, తెలుగువాళ్ల మధ్యనే అర్ధ శతాబ్దిగా ప్రాంతీయ స్పర్థలు, పడగవిప్పిన నాగుల్లా విషజ్వాలలను గ్రక్కుతున్నాయ్. ఎప్పుడూ లేనంతగా రెండు నెలల (పేరుకు 45 రోజులే) పైచిలుకు విధ్వంస విషవాయువులను తెలుగు ప్రాంతమంతా కమ్మింది. వారికి వారే భూకంపాలు, సునామీలు సృష్టించుకున్నారు. అరకొరగా ఉన్న సంపదను నాశనం చేసుకున్నారు. పిల్లల భవిష్యత్తునుదయరేఖల్లో చిక్కటి చీకటిని తురిమిపోశారు.

ఇదిలా ఉంటూండగా తమిళనాడులోని తెలుగు జిల్లాల్లో తెలుగు అభ్యసించరాదనీ, మాట్లాడరాదనీ ఓ వీరాంగం చేయడంతో పెను సమస్య చిగిర్చింది. ఉన్న తెలుగు బోధించే పాఠశాలల్లో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను నియమించకపోవడం, పాఠశాలలు తెరిచి ఆరు నెలలై, అర్థ సంవత్సర పరీక్షలు సమీపిస్తున్నా, తెలుగు పిల్లలకు పాఠ్యగ్రంథాలూ లేవు. అన్నీ ఉన్న పాఠశాలల్లో తెలుగు చదువుకొనే విద్యార్థులు లేరు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలుగు అధ్యయనం ఇలాగే క్షీణిస్తూ వస్తూంది.


## భాషా రాష్ట్రాలు తెచ్చిన మరో తంటా

గతంలో తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల మధ్య నదుల సమస్య భగ్గుమంది. కర్ణాటకలో తమిళవారినీ, తమిళనాట ఉన్న కన్నడిగుల్నీ చావకొట్టినంతపనిచేసారు.

ఇప్పుడు తమిళనాడు కేరళవారితో ముళ్ళై పెరియార్ డామ్ సమస్య చిలిక చిలికి గాలివానయింది. తమిళనాడులో ఉన్న కేరళ వాణిజ్య సంస్థలపైనా, కేరళీయులపైనా దాడులు జరుగుతున్నాయ్. ఇరు రాష్ట్రాల మధ్యనున్న బస్ సర్వీసులను రద్దుచేశారు. పొరుగు రాష్ట్రాల నుంచీ శబరిమలై వెళ్లిన భక్తులూ, వెళ్లవలసిన భక్తులూ అష్టకష్టాలు పడుతున్నారు. ఇరు రాష్ట్రాల పౌరుల రాకపోకలూ, రవాణా స్థంభించిపోయింది.

ఒకసారి కృష్ణా నీరు విషయంలో తెలుగుదేశం వారు మహారాష్ట్రకు దండయాత్రగా వెళ్లి పరాభవం పొంది వచ్చారు.

ఇలా రాష్ట్రాల మధ్యా, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్యా, రగడా ప్రగడలతో దేశం అట్టుడికిపోతూన్నది. మరోప్రక్క అవినీతి, లంచగొండితనం , గూండా రాజ్యం చేస్తున్నది. ఒక గజం నేల ఆస్తిలేనివాడు కూడా రాజకీయాల్లోకి వచ్చి కోట్లు వెనకేసుకుంటున్నాడు. ఇందు ఆ రాజకీయ పార్టీ, ఈ రాజకీయ పార్టీయని మినహాయింపు లేదు. నీతిమంతులనే వారున్న రాజకీయ పార్టీయే లేదు. స్వాములు, పాముల్లా రోడ్లమీదకొచ్చాయ్. తీవ్రవాదులు అడవులు ఆక్రమించడంతో, పులులూ, చిరుతలూ, ఏనుగులూ జనవాసాలకొస్తున్నాయ్. చెరువులు చేపలూ, రొయ్యల పెంపకంతో నిండిపోయాయి. బంజర్లూ, పంట పొలాలూ, హౌసింగు కాలనీలవుతున్నాయ్. సామాన్యుడు ఇల్లు కట్టుకోలేడు. పెరిగిన ధరవరుల్లో తిండి తినలేడు. నూనుగుమీసాల యువకులు విద్యావంతులైననూ, గాకపోయిననూ, నక్సలైట్లయినా అవుతున్నారు; దారిదోపిడీ దొంగలైనా అవుతున్నారు. ●

# భారతదేశం మనదే కానీ ఫలితము మనకేదీ?

## ఓమ్ శ్రీమ్ భారత మాత్రే నమః పరమపుణ్యభూమి భారతదేశం!

అనేకత్వంలో ఏకత్వానుభూతిని కల్గించిన ఒకే దేశం భారతదేశం. స్వర్గంలో ఎక్కడున్నాడో, వీరసింహం వల్లభాయి పటేలుండు స్వాతంత్రం సిద్ధించిన సత్వరమే భారతదేశంలో రాజుల ఏలుబడిలోనున్న సంస్థానాలన్నిటినీ ఒకే ఛత్రం క్రిందకు తెచ్చి 'ఏకదేశం'గా చేసిన మహనీయుడు. స్వాతంత్ర్యానికి భద్రత ఉండదనీ, పటిష్టమైన పాలనం పాలకులు సాగించలేరనీ భావించి, అందర్నీ ఒక ఛత్రం క్రిందకు తీసుకుని వచ్చాడు. గాంధీకి గానీ, నెహ్రూకుగానీ ఈ ఆలోచన పు(ప)ట్టలేదు. వారెవరికీ తెలియకుండా, ఆసేతుహిమాచల పర్వంతమూ ఒకే బృహద్విశాల భారతదేశంగా పటేల్ తీర్చిదిద్దారు. ఒక్క నిజాము మాత్రమే కలిసిరాలేదు. భారత ఉపప్రధానియైన వల్లభాయ్ పటేల్ నెహ్రూ ఎరుగకుండా రాత్రికి రాత్రి భారత సేనలను పంపి, నిజాము రాష్ట్రాన్ని భారత యూనియన్‌లో కలిసేట్టు చేసి, యావద్భారత దేశమునూ ఏకచ్ఛత్రాధిపత్యం కింద కొనితెచ్చిన మహావ్యక్తి – అలాటి వీరకేసరి వల్లభాయ్ పటేల్‌కు ఈ దేశస్థులు ఎంతో ఋణపడి ఉన్నారు.

**మేరా భారత్ మహాన్, మహావిశాల పుణ్యభూమి** అంటున్నాం అంటే పటేల్ వీరోచిత శక్తి సామర్థ్యాల ప్రభావమే.

భారతదేశానికి ఆధ్యాత్మికత ప్రాణం. ధర్మం ప్రాణం. సత్యం ప్రాణం. శీలం ప్రాణం. సమైక్యత ధ్యేయం. ప్రజల మనస్సుల్లో ఏకాగ్రత, మనుష్యుల్లో సఖ్యత, స్వచ్ఛతల్ని కలబోసి కలియపరచడానికి దేంవుడూ, భక్తి, దేవాలయాల నిర్మాణములనే ధర్మతత్వాన్ని పెద్దలు కల్పించారు. వ్రతాలు, హోమాలు, పూజలు, యాగాలు, పండుగలు – పబ్బాలు, గృహాల్లో పుట్టినరోజులు, పెళ్లిళ్లు, ఇరుగుపొరుగు వారిమధ్య ఇచ్చిపుచ్చుకోవడాలు వంటివెన్నో ఏర్పరచారు. ప్రతీ ఒక కార్యానికీ అంతర్వాహినిగా సమైక్యతా భావం, భరతమాత స్ఫురణ, వేదముల స్మరణ ఉండేట్టు చేశారు.

జంబూ ద్వీపే భరతఖండే, భరత వర్షే అంటూ మాతృదేశ స్మరణను, గంగేచ యమునేచ యనో, గోదావరి కృష్ణ మధ్య తీరే అనో లేదా కృష్ణా కావేరీ మధ్య తీరే అనో ప్రాంతాలను, నదుల పేర్లతో సహితమూ తప్పనిసరి ప్రవరగా చెప్పుకొనేట్టు చేశారు. బెంగాల్ దేశే, మహారాష్ట్ర ప్రదేశే, లేదా తమిళ, మలయాళ, కన్నడ, ఆంధ్ర, ఒరియా, అస్సామ్, మణిపుర, మేఘాలయ ప్రదేశములని వేదప్రవరలో చెప్పలేదు.

అలానే తల్లీతండ్రి తమ పిల్లలచే **'శ్రీ భారత మాత్రే నమః'** అని ప్రాతః సమయంలో లేచినప్పుడూ, రాత్రి పడుకొనేటప్పుడూ పిల్లలచే పలికించమన్నారు. ఈ పుడమిలో మనం పుట్టినందుకు, ఈ పుణ్య భూమి యొక్క గాలి, నీరూ ఆస్వాదిస్తున్నందుకూ, ఈ పుడమితల్లే మనకు కావలసిన ఆహారమిచ్చి జీవితాన్ని పోషిస్తున్నది; ఆహార వేషభూషణలకు ప్రత్తి, పట్టు దారా వస్త్రాలూ, బంగారం వంటి లోహాలను పండించి ఆ భరణాలనూ ఇస్తున్నది. ఆరోగ్యంగా ఉంచుతూ, ఆయుర్దాయం పెంచే ఔషధాలనూ సమస్తమూ ఇస్తున్న రత్నగర్భ ఈ భారతదేశం. ఎంతోమంది, ఎన్నో దేశాల నుంచీ వచ్చి, ఈ దేశ సంపదను కొల్లగొట్టుకుపోయిననూ ప్రతీకారము తీర్చుకోని తల్లి యీ భారతమాత. భగీరథుని వంటి సత్యసంధులైన చక్రవర్తోత్తములు దివినుంచీ గంగాజలమును భువికి గొనివచ్చిన దేశీ పుణ్యచరిత్ర ఉన్నది. జీవనదుల కాలవాలమీ భరతసీమ.

అన్య మతస్తులను సహితమూ తన ఒడిలో ఉంచుకుని, అన్నపాన, జీవనయాన వసతులను కల్పిస్తూన్న పక్షపాత రహిత. పుణ్యజనని పుణ్య గంగా, యమున, గోదావరి కృష్ణ, కావేరి, తుంగభద్ర వంటి జీవన నదులు పుడమిని సస్యశ్యామలం చేస్తూ, జీవాధారమైన సాగునీటినీ, త్రాగునీటినీ అందిస్తూన్నవి.

ఈ సకల జీవనోపాదినీ అనుభవిస్తూన్న అన్యమతస్తులు (నిజానికా వారా మతస్థానమైన బీజ సంబంధితులు కానే కారు. ఎన్నో తరాల క్రితం ఈ దేశం వచ్చినవారూ, పౌరసత్వం తీసుకున్నవారూ! ఇక్కడనే పుట్టినవారూ!) ఈ దేశాన్ని వారి దేశంగా భావిస్తారు గానీ, ఈ దేశమాతను వారి మాతగా ఆరాధించరు. కనీసం కృతజ్ఞతనైనా చూపరు. వందేమాతరం ఉచ్చరించం అంటూంటే మనమూ మన ప్రభుత్వమూ లేశమాత్రమైననూ క్లేశమొందడం లేదు. భగత్‌సింగ్ వంటి దేశభక్తులు పదే పదే 'వందేమాతరమ్' పదంగా పాడి, ప్రాణాలను తృణప్రాయంగా తలచి, ఉరికంబాలకెక్కారు. ఆ త్యాగనిరతులను మాటవరసకైనా స్మరించరు. ●

గురువులూ, పీఠాధీశులు కూడా ప్రతీ వ్రత, పూజా, యాగ కార్యక్రమములందునూ, తమ ప్రవచన ప్రారంభం నందునూ, **'ఓమ్ శ్రీమ్ భారతమాత్రే నమః'** అని ప్రారంభించడం ఓ నియమంగా పెట్టుకోవాలి. లలితా సహస్రనామంలో 'శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ, శ్రీమత్సింహాసనేశ్వరీ' అని చెప్పుకోవడం ఆచారంగా ఉంది! ఆ తల్లే భారతమాత ఎందుకు కాకూడదు! విష్ణుసహస్రనామ ప్రారంభంలో 'విశ్వం విష్ణుర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభు, భూతకృత్ భూత భృద్భావో భూతాత్మా, భూతభావనః' అని మనం స్తుతిస్తున్నాం! ఆ విశ్వప్రభువు జగత్ప్రభువు'కు క్షేత్రమిచ్చిన క్షేత్రజ్ఞ అమ్మ భారతమాతయే కదా! భారతభూమి పుణ్యభూమి, భారతమాత పుణ్యభారతమాత!

కావున ఓ గురువులారా! గురుర్‌బ్రహ్మ, గురుర్‌విష్ణు, గురుర్‌దేవో, మహేశ్వరా! అని ఏలా అంటున్నారో, అట్టి గురువులకు క్షేత్ర వసతి కల్పించిన భరతమాతను ముందుగా తలుస్తూ – **'ఓమ్ శ్రీమ్ శ్రీ భారతమాత్రే నమః'** అని ప్రవచించమని నా విన్నపం. మీరంటే ప్రజలూ విశ్వసిస్తారు.

SOUTHERN TRAVELS™
happy holidaying...
SOUTHERN TRAVELS PVT.LTD.
(Recognised by Ministry of Tourism. Govt. of India) Since 1970
18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 05.
Tel. : 011-4353 2800 (100 Lines), 2875 3466
Fax : 011-2875 7308, 4250 2090
e-mail : info@southerntravels.in
Winners of National Award as "The Best Domestic Tour Operator"
2 Times in a row securing 1st Position in India from the Ministry of Tourisim, Govt. of India
Book online through www.southerntravels.com
Our Tour Packages, Hotels in India & Domestic / Flight Tickets
Chennai : 044-2538 5253 Mumbai : 022 - 2501 0027
Vijayawada : 0866 - 257 6624 Vizag : 0891 - 274 5565
Bangalore : 080 - 2226 2633, Hyderabad : 040 - 2331 8866

క్రొత్త ఢిల్లీలో ఆంధ్రా హోటల్ HOTEL SOUTHERN
ఢిల్లీలోని తెలుగువారి ఏకైక వాణిజ్య సంస్థ
HOTEL SOUTHERN™
style. comfort. enjoy.
ఆధునిక ప్రయాణ సౌకర్యాలతో, ఉత్తర భారత యాత్రలు నిర్వహిస్తూ ప్రతి తెలుగింటా సుపరిచితమైన సదరన్ ట్రావెల్స్ వారి అనుబంధ సంస్థ "HOTEL SOUTHERN, Karol Bagh, New Delhi లోని ప్రముఖ వ్యాపార కూడలిలో, అధునాతన సౌకర్యములతో నిర్మింపబడి, 100 రూములు, Business Centre, విజయవాడ / అమరావతి రెస్టారెంట్లు గల హోటల్ సదరన్‌లో విడిది చేయగలరు.
Free pick up from Nizamuddin / New Delhi Railway Stations and Domestic Airport



# మకరరాశిలోనికి సూర్యభగవానుడు ప్రవేశించే మకర సంక్రాంతి!

ఆంగ్ల లెఖ్ఖల ప్రకారం సంవత్సర ప్రారంభం జనవరి నెలతో మొదలిడినా, మనకు ఆరోగ్యప్రదాత, వెలుగును ప్రసాదించే ప్రత్యక్ష దైవం సూర్యనారాయణుడు (సూర్యుడు) ఉత్తర దిశ నుంచీ మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. కాలచక్రంలోని రాశులన్నిటిలోకీ మకరరాశి ఉత్తమమైనది. కాలపురుషుడి గమనరాశిచక్రంలో మకరరాశి పదవది. దశమ సంఖ్య చాలా విశిష్టమైనది. ఇదెంతో పుణ్యప్రదం. గురు అనుగ్రహం కలిగిన పుణ్యదినమే మకర సంక్రాంతి.

సూర్యుడు తన కిరణాలతో లోకంలోని చీకటిని పారద్రోలుటకు మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. లోకం ఆయనకెంతో ఋణపడి ఉన్నందున ధర్మవర్తనులైన భారతీయులకు తీపి పొంగళ్ళు వండి నివేదనం చేస్తారు. చెరకు గడలతో పూజను చేయడం కూడా తీపిదనానికొక విశేషమే.


వైష్ణవ సాంప్రదాయపరంగా ధనుర్మాసం జరుపుకుంటాం. కలియుగ దైవం ఏడుకొండలవానికి వేకువ సమయంలో సుప్రభాతానికి మారుగా తమిళంలోని పాశురాలు ప్రవచిస్తారు. ఇంటికి సిరులొలకపోసే మహా(సంక్రాంతి) లక్ష్మి రావడం జూచి పులకాంకితులైన గ్రామజనులు :

**హరిహరీ నారాయణ ఆదినారాయణుడో**
**కరుణించమమ్మేలు కమలలోచనుడా**

– అని మనం ప్రార్థిస్తే, తమిళ ప్రాంతాల్లోన 'పొంగలో పొంగల్' అంటూ పులకాంకితులవుతారు. అక్కడా ఇక్కడా పశువుల్ని అలంకరించి బళ్లకు కట్టి ఊరేగించడం, కూతుళ్లు, కుమాళ్లు, కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లతో కుటుంబమంతా కొత్త దుస్తులు కట్టుకుని సంతోషంగా ఉండడం, ఇంట్లోని

(తరువాయి 8వ పేజీ)





**పాడిపంటల లక్ష్మియే**
**సంక్రాంతి లక్ష్మి యింట**
**పుడమి తల్లిని సేదతీర్చ - పుష్య**
**రుతువు వచ్చునంట -**
**ప్రకృతినే పులకించునంట!**

# ముగ్గులు పెట్టరారమ్మా! ముదితలందరుకూడి - వాకిట ముగ్గులు పెట్టరారమ్మా!



**ధనుర్మాసం వచ్చిందంటే చాలు, వాకిట గోమయంతో కళాపు చల్లి, శుభ్రపరచి, చక్క చక్కటింగ ముగ్గులు పెట్టేవారు కరువయ్యారు.**

**ముందస్తుగా 'ముగ్గు ముగ్గోయమ్మ ముగ్గు' అంటూ ముగ్గు విక్రయించే ఆడవాళ్లు వస్తూండేవారు అరుదయ్యారు. అమ్మకాలు లేక వాళ్ళు రావడం లేదు. కలిగినవారూ, సాంప్రదాయాన్ని పాటించేవారూ బియ్యపుపిండితో కూడా ముగ్గులు పెట్టేవారు. అవి కొన్ని క్రిమికీటకాలకు ఆహారంగా ఉండేవి. గోమయం నీళ్లతో హాని కలిగించే క్రిమికీటకాలు నశించేవి. ఆరోగ్యం కాపాడే లక్షణం కాపుదలగా ఉండేవి. సంక్రాంతి వచ్చిందటే చాలు, గంగిరెద్దుల వారు వచ్చేవారు. వాళ్లు గంగిరెద్దును ఆడిస్తూ అమ్మగారికీ దణ్ణం పెట్టు, అయ్యగారికీ దణ్ణం పెట్టని సన్నాయి బాకా వాయిస్తూ, వరిధాన్యమే తీసుకుని వెళ్లేవారు. బుడబడక్కలవాళ్ళ డిక్కీ వాయిస్తూ వచ్చేవారు. అంబ పలుకు, జగదంబ పలుకు, ఇంటి వారందరికీ శుభం పలుకు అంటూ శుభవచనములే పలికేవారు. భట్రాజులు వచ్చి పద్యాలు పాడేవారు. పగటి వేషధారులు రోజుకో వేషం వేసేవారు.**

**(7వ పేజీ తరువాయి)**

ఆలమందలను సహితము అలంకరించడమూ, స్వయంగా గడ్డిపరకలు అందించడం చూస్తూంటే ప్రతీ యిల్లూ గోకులమా అనిపిస్తుంది. ఇంటి ముంగిటకు వచ్చే గంగిరెద్దుకు బొట్టులు పెట్టి, గంగిరెద్దు ఆడించేవానికి నూకలిస్తూన్నప్పుడు ఇంటికి నందీశ్వరుడొచ్చినట్లు భావిస్తారు. అడ్డబొట్టు పెట్టుకుని తలకు పాగా కట్టుకుని, శంఖం ఊదుతూ జంగమ దేవర వచ్చి, శుభ వచన ములు పలికినప్పుడు శివసాక్షాత్తూ స్వరూపుడేతెంచినంత ఆనందాన్ని పొందుతాం.



పండు వెన్నెలను, నిండు గుండెలో నింపుకుని, పంటచేల సొగసు పట్టుచీరగా కట్టుకుని, దరహాస ధనరాశులను తోడుగా తెచ్చుకుని ఘల్లు ఘల్లున కాలి అందెలు రవళించుచు వచ్చెనమ్మా సంక్రాంతి లక్ష్మి

నడచి వచ్చినమ్మా - తల్లి సంక్రాంతి లక్ష్మి

- అంటూ వెల్లువలా పారే ఉత్సాహంతో పండుగ మూడురోజులూ పిల్లాపెద్దా పొంగిపోతారు.

వాకిళ్ల ముగ్గులూ, నెలకు ముందునుంచీ ముగ్గిళ్ళపై గొబ్బెమ్మలూ, గొబ్బెమ్మల మీద, ద్వారముపై బంతిపూలూ మాలలుగా పెట్టుకుని ఆనందించే మూడు రోజుల ముచ్చంపు పండుగ ఇదే.

సంవత్సరంలో వచ్చే పండుగలన్నీ కూర్చే ఆనందం వేఱు, సంక్రాతి పండుగ కూర్చే ఆనందం వేఱు. నెల పొడుగునా ఆనందం అలముకుని ఉంటుంది. నేల ముగ్గులు చూచి నెలరాజు సహితమూ మురిసిపోతాడు.

**నవరాగపుష్పములు సిగలో చుట్టుకుని**
**నేత్రాంచంబులందు పున్నమి నెలరాజు**
**కాంతులవలె వెలయగా, నింగిపై**
**కుందనపు ముద్దగా సూర్యుడు చూస్తూండ, నేలపై**
**భోగిమంటల జ్వాలలు జిగిజిగ్గేజ్జేలన**
**దేదీప్యమానంగా ఉండే వీధి ప్రాంగణములు** ఎంతెంత వెలుగులు కొలుపుతాయని చెప్పగలను.

భోగినాడు ఉదయం భోగి మంటలు, సాయంత్రం ఇ(క)ంటి పాపలకు భోగిపళ్లు పోసే వేడుక. సంక్రాంతికందరూ నొక చేత చెరుకుగడల పట్టుకుని సామూహికంగా అన్నపు పొంగళ్లు పెట్టుకునే చందం, కనుమునాడు పశువుల్ని అలంకరించి త్రిప్పడం ఓ వేడుక. ఈ పండుగల్లోనే కోడి పందాలు, ఎడ్లబండ్ల పరుగు పందాలు ఎన్నని చెప్పగలం. స్త్రీలు గౌరీవ్రతం, గొబ్బిగౌరీ పూజ, ఈరోజుల్లోనే శ్రీమద్రమారమణగోవింద హరీ అంటూ హరిభజన చేస్తూ, మెడలో తంబుర, చేతుల్లో చిడతలు, కాళ్లకు మువ్వలు ధరించి, సాక్షాత్తూ నారదుల వలె హరినామ స్మరణ చేస్తూ వచ్చే హరి భజనాదాసులు సిరుల సందడి కురిపిస్తారు. ఈ మకర సంక్రమణం రోజుననే ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. సూర్యకిరణాల్లో వేడి అధికమవుతుంది. అందుకే భోగిరోజున నువ్వులనూనెను రాసుకుని, తెలగపిండితో ఒళ్ళు రుద్దుకుని, నువ్వులు కలిపిన నీళ్లతో స్నానం చేయమంటారు. మకరరాశికి శని అధిపతి కాబట్టి, నువ్వులు, బెల్లం, గుమ్మడికాయ దానం ఇస్తే, శని కఠోర దృష్టి మనపై పడదంటారు. నిజానికీ మూడు రోజులూ దానాల పండుగ, రైతుల పండుగ, పశువుల పండుగ, స్త్రీల పండుగ, పితృదేవతలకు తర్పణాలిచ్చే పండుగ, కొత్త అల్లుళ్ల పండుగ. ఇంటికి వచ్చే జానపద కళాకారులను ఆదరించే పండుగ, సస్యలక్ష్మిని పరవశింపచేసే పండుగ. అన్ని పండుగలనూ కలగలిపిన పండుగ. ●

*If you want Comfortable Stay-*
*Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114



# గొప్ప దార్శనికుడు పి.వి. నరసింహారావు!

**- దేశ రాజధానీ, కాంగ్రెసూ ఆయన్ను మరిచి పాపం చేసుకున్నది!! -**

తెలుగువాని గొప్పతనమును, దేశం ఒప్పుకోదు; తెలుగువాడు అసలు చెప్పుకోడు. ఒకరంటే ఒకరికి గిట్టనితనం తెలుగువారిలోనే ఉన్నది. అఖిల భారత కాంగ్రెసునందున్నది.

ఆనాడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతుల్ని ఎదగనీయకుండా చేసినది కాంగ్రెసే! అటుతరువాత గొప్ప దార్శనికునిగా, భాషావేత్తగా, పరిపాలనాదక్షునిగా ప్రపంచ నేతల మన్ననలందిన నెహ్రూయేతర కుటుంబానికి చెందినవాడూ, ఆర్థిక ఒడిదుడుకుల్లో ఉన్న భారతదేశాన్నీ, అస్థిమితంగా ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాన్నీ, ఐదేళ్లపాటు పాలించి, ఐదువేళ్ల కాంగ్రెసు హస్తాన్ని చరిత్రలో చెరిగిపోకుండా చేసిన అసమాన ప్రతిభాశాలి **'పి.వి.'**గా ప్రఖ్యాతిగాంచిన శక్తివంతుడైన వ్యక్తి పాములపర్తి వేంకట నరసింహారావు. **పి.వి.** నంద్యాల లోక్‌సభ ఎన్నికలకు తెలుగుదేశం పోటీ పెట్టకుండా తెలుగు గౌరవాన్ని చూపినవాడు నందమూర్తి తారకరామారావు. ఆయన్ను ఐదు లక్ష్మీల లక్షల ఓట్ల ఆధిక్యతతో గెలిపించడానికి శాయశక్తులా కృషి చేసినవాడు కోట్ల విజయభాస్కరరెడ్డి. అయితే ఈ ముగ్గురూ ఆంధ్రదేశానికి ముఖ్యమంత్రిత్వం వహించినవారే!

పి.వి. నరసింహారావు బహుభాషల్లో (దాదాపు దేశ విదేశ 23 భాషల్లో) పండితుడు. వక్తయేగాని మితభాషి. అర్థాత్మకమైన అచ్చ తెలుగు పలుకుల పలుకుబడి కలవాడు. అసాధారణ నుడి కల అక్షర ప్రతిభ కల ప్రతిభావంతుడు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'వేయి పడగలు' గ్రంథాన్ని హిందీలోకి అనువదించిన ఘనాపాటి. తెలంగాణా బిడ్డ, మాతృభాష తెలుగుపై అమేయ అద్వితీయ ప్రేమాభిమానాలు కలవాడు.

ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిననన్తరం శాసనసభలో మాట్లాడుతూ -

**ఈ నిద్రాణ నిశీథి మహిత జాగృతి పుంజముగ వెలుగుటయే నా తపస్సు - వెలిగించుట నా ప్రతిజ్ఞ -** అన్నారు. అన్న మాటలకు సార్థకత చేకూర్చినవాడూ పి.వి. నరసింహారావే! ఏ కులమత వర్గాల గుంపునూ దరి చేరనీయలేదు. ప్రజాస్వామ్య దృష్టీ, అట్టడుగు వర్గాల అభివృద్ధికీ ఆయన ఎంతగానో కృషి చేశారు, భూసంస్కరణలను చేబట్టారు. ఆ భూసంస్కరణలు ఆయన పాలిట శాపమైంది. రాజకీయ వర్గాల్లో అనేక ఆందోళనలు చెలరేగాయ్.

పి.వి. రాజనీతిజ్ఞతను ఇందిరాగాంధీ గుర్తించి, తన ఆంతరంగిక సలహాదారునిగా చేసుకోవడమే గాకుండా, మహారాష్ట్ర రామ్‌నగర్ నియోజిక వర్గం నుంచీ లోక్‌సభకు ఎన్నికయ్యే విధంగా దోహదపడింది. కేంద్రంలో విదేశ వ్యవహారాల మంత్రిగా ఉంటూ, అంతర్జాతీయంగా మేధావిగా గుర్తింపబడిన వ్యక్తి. నెహ్రూ కుటుంబానికి అత్యంత విశ్వాసపాత్రుడూ! రాజీవ్‌గాంధీ ప్రధాన సలహాదారుగా పి.వి.యే ఉండేవారు.

పి.వి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో తెలుగు భాషా వ్యాప్తి కోసం ఎంతో శ్రద్ధను వహించారు. తెలుగు భాషాభ్యున్నతినుద్దేశిస్తూ **తెలుగు అకాడమీ**ని స్థాపించారు. **తెలుగు అధికార భాషా సంఘ స్థాపన** కూడా ఆయన ఆలోచనయే. పాఠశాలల్లో బోధనా భాషగా తెలుగు ప్రాముఖ్యం యిస్తూ, ఎంతో శ్రద్ధనూ, ఆసక్తినీ చూపారు. పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచీ 10వ తరగతి వరకూ తెలుగు బోధన అమలులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వంలో విదేశాంగ శాఖా మంత్రిగా ఉన్నప్పుడు భారతదేశానికి మంచి పేరుప్రతిష్ఠలు తీసుకుని రావడం, ఐక్యరాజ్య సమితిలో **పి.వి.** చేసిన అనర్గళ ప్రసంగానికి వివిధ దేశాల ప్రతినిధులు వినమ్రంగా లేచి పది నిముషాలు కరతాళ ధ్వనుల చేస్తూ ప్రశంసించడం అపూర్వమైన విశేషం. మానవ వనరుల శాఖా మంత్రిగా ఉన్ననూ కేంద్ర మంత్రివర్గంలో నెం.2గానే ఉన్నారు. వివాదాస్పదాల్లో తలదూర్చేవారు కాదు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల మెప్పులందిన మహా మనిషి.

తాను జ్ఞానపీఠ కమిటీలో ఉన్నప్పుడు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారి 'రామాయణ కల్పవృక్షం' గ్రంథానికి జ్ఞానపీఠ అవార్డు రావడంలోనూ, మధుర మంజుల కవిభూషణ సి.నారాయణరెడ్డి గారికి జ్ఞానపీఠం అవార్డు రావడంలోనూ **పి.వి.** ప్రమేయం ఉందంటారు. ఆయనకు తెలుగు కవుల పట్ల అపారమైన గౌరవాభిమానాలుండేవి. అప్పుడప్పుడా కవి మిత్రులను, పాత స్నేహితుల్ని కలుసుకోవడానికి హైదరాబాద్ వస్తూండేవారు. ఆయనంటే తెలంగాణా కవులు కాళోజీ నారాయణరావు, దాశరథి ప్రభృతులు ఆదరాభిమానాలు చూపేవారు. కొన్నాళ్లు గ్రంథ రచనపై దృష్టి నిలిపారు. రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

రాజీవ్‌గాంధీ హత్యానంతరం తప్పనిసరి పరిస్థితుల్లో అందరి ఆమోదంతో ప్రధాని పదవిని చేబట్టారు. ఆ పదవి ఆయన కోరుకున్నది కాదు, వివాదారహితుడనీ విదేశాంగ మంత్రిగా ఇతర దేశాల వారికి ఎరుకైనవాడనీ, ఇంకెవర్ని ప్రధానమంత్రిని చేసిన అసమ్మతివర్గం చేరుతుందని అందరూ భావించి చేసిన ఏకాగ్ర నిర్ణయం. ఆయన ప్రధాన పదవి, అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని చేబట్టి, కొత్త ఆర్థిక విధానాన్ని ప్రవేశపెట్టి భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచీ అవలీలగా గట్టెక్కించడమే కాకుండా, కొన్ని సంస్కరణలు అమలుకు తెచ్చి, పూర్వ ప్రధానులు తాకట్టుపెట్టిన బంగారాన్ని విడిపించారు. ఏదో ఉద్యోగం చేసుకుంటూన్న మన్మోహన్‌ను ఆర్థిక శాఖా మంత్రిగా చేసి, తగిన సలహాలిస్తూ దేశ ఆర్థిక విధానాన్ని చక్కపెట్టారు. పోక్రాన్-2 అణుపాటవ పరీక్షను విజయవంతంగా జరిపించారు. రామజన్మభూమి విషయంలో ఉత్తరప్రదేశ్‌ను విశ్వసించి దెబ్బతిన్నారు. సోనియాగాంధీకి కూడా సలహాలిచ్చి మెప్పులు పొందిన పి.వి.యే సీతారం కేసరి, మరికొందరు కుట్రలకు గురియయ్యారు. ఐదు సంవత్సరాల పాటు దేశాన్ని ఒక తెలుగు ప్రముఖుడు పాలించి ప్రపంచ పటంలో అభివృద్ధిగల భారతదేశంగా నిలపెట్టారు. కాంగ్రెసు కారణంగానే కోర్టుకేసులందు చిక్కుకుపోయిన పి.వి. స్వయంగానే వాటికోసం పోరాడారు. కాంగ్రెసు రవంత సహాయం కూడా చేయలేదు. పి.వి. చనిపోతే ఢిల్లీ రాజధానిలో ఆరడుగుల స్థలమైనా పి.వి. సమాధికి యివ్వలేదు. అరకొరకాలం ప్రధానత్వంలో వెలిగించిన వారికి సమాధి స్థలాలు యిచ్చారు. పి.వి.కి మూడడుగుల నేల కూడా యివ్వలేదు. కనీసం పార్థివ శరీరాన్ని అఖిల భారత కాంగ్రెసు ఆఫీసులో ఉంచలేదు. ●

మరల పుట్టని దేశోద్ధారకుడు!

# 'దేశోద్ధారక' కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు!

'అమృతాంజనం' అధినేతగా ఆయన ఆరోజుల్లోనే కోట్లు సంపాదించారు. కోట్లు దానధర్మాలు చేశారు.

- దేశం మొత్తమ్మీద దేశోద్ధారక బిరుదము కల ఒకే వ్యక్తి! -

**దేశమును ప్రేమించుమన్నా, మంచియన్నది పెంచుమన్నా !**


– అన్న మహాకవి గురజాడ అప్పారావు 'ముత్యాలసరం' వంటి పదాలకు ప్రతిభ కూర్చినవారు తెలుగులోని ఒక్క కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారేక్కు

ఆయన దయాశీలియైన వ్యాపారవేత్త. తెలుగులో తొలిగా 'ఆంధ్రపత్రిక'యనే దినపత్రికను స్థాపించి, పత్రికా రచయితయైనారు. స్వాతంత్ర్యోద్యమంలో కృషి చేస్తున్న నాయకులను ఆర్థికంగా, హార్థికంగా ప్రోత్సహించుతూ, ఆయన కూడా స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించి, రాజకీయ నాయకుడైనారు. అయితే తానేవీ పదవులు ఆశించలేదు. 1907 సం॥ము "సూరత్"లో జరిగిన కాంగ్రెసు ఉదయంలో తిలక్‌గారి ఉపన్యాసం ఆయన్ను రాజకీయ ప్రభావితుల్ని చేసింది. ఆయనలో స్వాతంత్ర్యోద్యమ బీజాలను నాటింది. గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొనడమేగాకుండా, మహాత్ముని అడుగుజాడల్లో నడుస్తూ, తన సర్వస్వాన్నీ ఉద్యమానికి అర్పించిన మహనీయుడు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్షను కూడా అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధుడు.

ముంబాయి నగరంలో 'అమృతాంజన్' అనే ఔషధ పరిశ్రమను ప్రారంభించి, ఆ వచ్చిన లాభాలు దేశసేవకూ, ఆంధ్రపత్రికకూ వినియోగించేవారు. పేద విద్యార్థులకు ఉపకార వేతనములిచ్చేవారు. తనవద్దకు ధనసహాయం కోసం వచ్చేవారికి లేదనకుండా ధనసహాయం చేసిన విశ్వదాత.

కృష్ణా జిల్లా ఏ పుణ్యం చేసుకున్నదో కానీ, గొప్ప గొప్పవాళ్లంతా అక్కడే పుట్టారు. దేశోద్ధారక, విశ్వదాత, కళాప్రపూర్ణ, మహనీయుడూ జాతీయభావాలు కలవాడు జ్ఞానీ, మాతృభాషా ప్రియుడూ, దేశభక్తితత్పరుడైన కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు కృష్ణా జిల్లా యందలి ఎలకుర్రు అగ్రహారంలో పరమ నైష్ఠికులైన బుచ్చయ్య శ్యామలాంబ దంపతులకు 1862 సం॥ము మే 1వ తేదీన జన్మించారు. గొప్పవాళ్లు అందరు చదువుకున్న బందరు హిందూ హైస్కూలు, మద్రాసు క్రిష్టియన్ కళాశాలల్లో చదువుకున్నారు. చదువు ముగిసిన తరువాత ఆయన్ను అదృష్టం వెదక్కుంటూ బొంబాయి నగరం చేర్చింది.

బొంబాయిలోని విలియం అండు కో అనే విదేశీయుని ఫార్మసీ (మందులు) సంస్థలో చిరు ఉద్యోగిగా చేరారు. 'అమృతాంజనం' మందును కూడా ప్రవేశపెట్టారు. నాగేశ్వరరావు గారి పట్ల ఆ సంస్థ యజమానికి నమ్మకం పెరిగింది, నడత నచ్చింది. ఆ దొర తన దేశానికి వెళ్లిపోతూ ఆ సంస్థను నాగేశ్వరరావు పంతులుగారికిచ్చి వెళ్లాడు. 1893 సం॥ము నుంచీ మందుల వ్యాపారం కలిసి రావడం, అమృతాంజనం విపరీతంగా అమ్ముడుపోవడంతో, ఆ సంస్థకు అమృతాంజనం డిపో అనే పేరు పెట్టారు. ఆ పేరు పెట్టినప్పట్నుంచీ కోట్ల కొలదీ సంపాదన పెరిగింది. డబ్బు చేరేసరికి కొందరికి ధనమదం పెరుగుతుంది. కానీ ఆయనలో ఉదారతా భావం పెరిగింది, దేశీయాభిమానం కలిగింది. లోక మాన్య తిలక్ ఉద్యమంలో చేతులు కలిపారు. ఆయన మహారాష్ట్రలో ఉంటున్నప్పటికినీ మాతృభాషాభిమానం అంకురించింది. తన భాషకాని ప్రదేశంలో తన భాషా సాహిత్యాలను పెంచడం కోసం, 1908 సం॥ములో 'ఆంధ్రపత్రిక'ను వారపత్రికగా ప్రారంభించారు. ఆంధ్రజాతి సేవకు, ఆంధ్ర భాషాభ్యున్నతికి కంకణం కట్టుకున్నారు. భాష కానిచోట అక్కడ తెలుగు అచ్చు కూర్పులు లేవు, కంపోజు చేసే తెలుగు పనివారు లేరు. ముద్రణా యంత్రాలు లేవు.




వీటన్నిటినీ కూర్చుకోవడానికి అధిక ప్రయాసలు పడవలసి వచ్చింది. అధిక వేతనాల్ను యివ్వవలసి వచ్చింది. వీటన్నిటినీ ఓర్చుకుని 'ఆంధ్ర పత్రిక'ను నిర్వహించారు. ఆంధ్రభాషను అభివృద్ధిపరచుకోవడానికి, ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలని సంకల్పం నాగేశ్వరరావు పంతులుగారికే తొలిగా కలిగింది! అమృతాంజనంలో వచ్చిన లాభాలన్నింటినీ ఆంధ్రోద్యమం కోసం వెచ్చించిన తొలి త్యాగశీలి ఆయనే!

**ఎక్కడి బందరు ఎక్కడి బొంబాయి. చిరు ఉద్యోగిగా చేరిన నాగేశ్వరరావు గారికి పెద్ద కంపెనీ నిర్వహించే యాజమాన్యం పీఠం దక్కింది. దొరికిన అదృష్టాన్ని దేశానికీ, స్వాతంత్ర్యోద్యమానికీ భాషా సాహిత్య సారస్వతాభ్యున్నతికే ఉదారంగా యిచ్చిన విశ్వదాత. ఎందరో పేద విద్యార్థులు విద్యనభ్యసించడానికీ, ఎందరో మాతృభాషా సాహితీవేత్తలు కావడానికి, స్వాతంత్ర్యోద్యమ సైనికుల్లా రూపొందడానికి కారకుడైన దేశాభిమాని.**



1914 సం॥ములో తన నివాసమును, అమృతాంజనం, ఆంధ్ర పత్రికలతో బాటు చెన్న పట్టణం తరలి వచ్చారు. 'ఆంధ్ర పత్రిక'ను దిన పత్రికగా మార్చారు. అది స్వాతంత్ర్యోద్యమానికీ, ఆంధ్రోద్యమానికి ఎంతో ప్రోత్సాహం యిచ్చింది. సాహిత్యాన్ని ప్రోత్సహించడం కోసం 'భారతి' మాసపత్రికను ప్రారంభించారు. సాంప్రదాయ గ్రంధాలను ప్రచురించడం కోసం 'ఆంధ్ర గ్రంధమాల'ను ప్రారం భించారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, ఆంధ్ర విజ్ఞాన సర్వసం ప్రచురించడానికి కొమర్రాజు లక్ష్మణ రావు గారికెంతో ప్రోత్సాహ మిచ్చారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంచడానికి 'భగవద్గీత'కు తెలుగు వ్యాఖ్యానాన్ని తానే వ్రాసి ప్రచురించారు. 'ఆంధ్ర పత్రిక' ప్రచురించే ప్రత్యేక సంచికల్లో రాజకీయ, సాంఘిక, చారిత్రిక, సామాజిక వ్యాసములు విశేషంగా ఉండేవి. 25 పేజీలు ప్రస్థానం పేరుతో సంపాదకీయం, 26 పేజీల సంవత్సర పంచాంగం (తరువాత తరువాత ఆంధ్రపత్రిక పంచాంగంగా పేరు పొందింది) 46 పేజీల రాజ్యాంగ సంస్కరణలు, జాతీయాంతర్జాతీయ విషయ సమర్పణ, 25 పేజీల ప్రకటనలతో 268 పేజీలతో ఓ విజ్ఞాన సర్వసంగా వెలువడేది. తాను అనేక గ్రంథాలను ప్రచురించడమే గాకుండా, గ్రంథ రచన చేసే సాహితీవేత్తలకు ద్రవ్యసహాయం చేసేవారు. చదువుకొనే విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేవారు. ఆంధ్రపత్రిక కార్యాలయం కవులతో, కళాకారులతో నిండి ఉండేది. ఎవరినీ లేదని పంపించేవారు కాదు. నాటక నాట్య కళా ప్రదర్శనలను ప్రోత్సహించడం కోసం విజయవాడలో దుర్గా కళామందిరం నిర్మించారు. తరువాత అది సినిమా థియేటర్‌గా ఉండేది. మద్రాసులో ఆయన నిర్మించుకొన్న 'శ్రీబాగ్' భవనం సీమాంధ్రుల మధ్య బాట వేసి శ్రీబాగ్ ఒడంబడికతో చారిత్రాత్మకమయింది. ఆయననెన్నో బిరుదములు వరించాయ్. మహాత్మాగాంధీ ప్రత్యేంగా ప్రశంసించారు. 1938 ఏప్రిల్ 11న ఆయన మరణించేలోగా ఆయన చేసినన్ని మంచి పనులు ఏ ఒక్కరూ చేయలేదంటే అతిశయోక్తి కాదు. ఆయన్ను 'విశ్వదాత'గా కీర్తించింది మహాత్మాగాంధీయే! దేశోద్ధారక అన్నది దేశ ప్రజలే! ఆయన మరణానంతరం భారతప్రభుత్వం ఆయన పేరిట తపాలా బిళ్ల విడుదల చేసి గౌరవించింది. ●


మహాకవి 150 జయంతి :

# దేశమును ప్రేమించుమన్నా - మంచియన్నది పెంచుమన్నా!

## - గురజాడ మహాకవి గేయాన్ని ప్రచారం చేయాలి!! -

ప్రస్తుత దేశ పరిస్థితులూ, రాష్ట్ర పరిస్థితులూ అధ్వాన్నంగా తయారయ్యాయ్! దేశమును ప్రేమించేవారు కరువయ్యారు. మంచియన్నది పెంచుమన్నా అనే మనుష్యులూ సొంతమూ లేరు. ఒకవేళ మాటవరసకు ఎవరైనా కోటికొక్కరు అన్నప్పటికినీ – మహాకవి గురజాడ మాటల్లోనే 'వట్టి మాటలు కట్టిపెట్టోయ్ గట్టిమేల్ తలపెట్టవలెనోయ్' అని గద్దించి చెప్పవలసిన అవసరం వచ్చింది.

ఆయన జాతీయ కవి. రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల్లానే గురజాడ అప్పారావు గారి కవితలు జనతను మేల్కొలిపాయ్. గురజాడ అప్పారావులా దేశభక్తిని మేల్కొలిపిన మహాకవి మరొకరు లేరు. సమాజం లోని మూఢాచారాలను తెగనాడారు. ఈ దేశంలో పుట్టిన ప్రతీ ఒక్కరూ దేశాన్ని ప్రేమించాలన్నారు. మంచియన్నది పెంచాలన్నారు. 'దేశమంటే మట్టి కాదోయ్, మనుష్యులోయ్' అని చెప్పి, కళ్ళు తెరిపించినవాడు మహాకవి గురజాడ అప్పారావు గారొక్కరే! గుణవర్ణపరంగా ఆయన బ్రాహ్మణుడు. కానీ ఆయనలో అందరూ, అందరు వర్ణాలవారూ ఆయన శరీరంలోని అవయవాల్లాంటివారుగానే చూచుకున్నారు, ప్రేమించారు. వారి అభ్యుదయంకై పాటుపడ్డారు. ఆయన సంస్కృతీకర్త, సంస్కర్త. ఆయనేం చెప్పారో, అది ఆచరణలో చూపించారు. ప్రపంచంలో గురజాడ అప్పారావు గారికి సాటి రాగల ప్రజాకవులు లేనే లేరు.



ప్రపంచంలో ప్రతిభావంతులైన యిలాటి అభ్యుదయ కవులను, వారి గృహాలను జాతీయ సంపదగా వందల తరబడి సంవత్సరాలు స్మారక చిహ్నాలుగా నిలుపుకునే గొప్ప సాంప్రదాయం ఉంది. వారు శకపురుషులు, ఎన్ని శకాలకైనా వారి స్మృతులను ప్రజలకందించడం, వారి గృహాన్ని పురావస్తుశాఖ, రాష్ట్రప్రభుత్వం జాతి స్మారక చిహ్నాలుగా నిలపవలసిన బాధ్యత ఉన్నది.

లండన్ మహానగరానికి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ రచయిత షేక్స్పియర్ నివసించిన గృహాన్ని 1564 సం॥ము నుంచీ జాతీయ చిహ్నంగా ఆ ప్రభుత్వం కాపాడుతూన్నది. ఆయన స్మారక ఉత్సవాలను జరుపుతూన్నది. భారతదేశం నుంచీ కూడా ఎందరో రచయితలు షేక్స్పియర్ నివాసాన్ని సందర్శించి, నివాళులర్పించి వచ్చారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 150వ జయంతి ఉత్సవాలను బెంగాల్ రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వమూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఎంతో ఘనంగా జరిపింది, రవీంద్రునికి నివాళులర్పించారు. ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో బాటు, కేంద్రమంత్రి ప్రణబ్‌ముఖర్జీ, ఎందరో ప్రముఖులు ఆ వేడుకలందు పాల్గొన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, బెంగాల్ సాహిత్య అకాడమీ, ఆ రాష్ట్ర ప్రభుత్వమూ కలిసి ఠాగూర్ మహాకవి వేడుకల్ని సంవత్సరం పొడుగునా జరుపుతున్నారు.

మన రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రుని సమకాలికుడూ, ప్రజాకవీ, మహాకవీ, సంఘ సంస్కర్త, దేశభక్తుడైన గురజాడ అప్పారావు 150 జయంతి వేడుకల్ని అంతటి ఘనంగా జరుపుతుందని విశ్వసించాం. గురజాడ మహోన్నతనూ, దేశభక్తినీ, సంస్కార ప్రియత్వాన్ని ఆయన జనులనుత్తేజపరుస్తూ దేశమును ప్రేమించండి, మంచి అన్నది పెంచండి, వట్టి మాటలు కట్టిపెట్టండి, ఘట్టి మేల్ తలపెట్టండి – అనే మాటలను యీనాటి తెలుగుతరంలో నాటి ఉత్తేజపరచడం ఎంతో అవసరం. వారీ గురజాడ బోధల్ని ముందుతరాలకు తీసుకుని వెళ్ళేట్టు చేయాలి.

'దేశమనియెడు దొడ్డవృక్షం
ప్రేమయనెడు పూలెత్తవలెనోయ్।

– అంటూ మరింత స్పష్టంగా నొక్కి మరీ చెప్పాలి. ప్రస్తుత పరిస్థితుల్లో గురజాడ సందేశం ఎంతో మంచి మందుగా పనిచేస్తుంది. గురజాడ చెప్పిన మంచీ, చేసిన 'మంచి' కన్న గొప్పగా అన్యులెవరూ చేయలేదు.

కేంద్రంలో ఉన్న తెలుగు మంత్రులు గురజాడ జాడను కేంద్రానికి తెలియచేయాలి. రాష్ట్రప్రభుత్వానికి కనువిప్పు కావాలి. పరస్పరం తగువులాడుకునే అధికారపక్షం, ప్రతిపక్షాల వారికీ విషయాల్ని విజ్ఞులైన ప్రజలే తెలియజెప్పాలి. యువత తలుచుకుంటే ఇదెంత కష్టమైన కార్యం కాదు. వారికి గురజాడ వేసిన ప్రతీ అడుగూ, కవితల్ని చెప్పేవారేరీ? వారికి జ్ఞానోదయం కల్పించేవారేరీ?

ఆయన ఎంత మేధావీ, ఎంతటి సంస్కారీ, ఎంతటి ప్రజల మనిషీ, ఎంతటి మహామనిషీ?

## నూరేండ్ల తెలుగు కథకు శ్రీకారం చుట్టినవాడు!

ఆనాటి సాంఘిక రుగ్మతల్నే కాదు, ఈనాటికీ, ఏనాటికి సంఘాన్ని బాధిస్తున్న వివాహ సమస్యను 'కన్యాశుల్కం' నాటక రచన ద్వారా విశదపరిచిన వాడు. ఆయనే 1892 సం॥ములో ఈ నాటకం తొలి ప్రదర్శనం జరిగింది. అప్పట్నుంచీ ఈ నాటకాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఈ నాటక ప్రదర్శనకు తొమ్మిది గంటల కాలం పడుతూంది. ఇది సంఘంలోని అనేక రుగ్మతల సమాహారం. దీన్ననుసరించే 'వరవిక్రయం' వంటి ఎన్నో సమస్యాపూర్వక నాటకాలు వచ్చాయ్. కానీ యీ నాటకానికి ధీటుగా ఏ నాటకమూ రాలేదు. ఈ నాటకాన్ని సంక్షిప్తీకరించి 1909 సం॥ము రెండవ ముద్రణం వచ్చింది. అప్పట్నుంచీ ఇప్పటివరకూ 'కన్యాశుల్కం' నాటకాన్ని కొన్ని వందలమంది నటులు, కొన్ని వేల ప్రదర్శనలు యివ్వడం జరిగింది.

ఎన్టీ రామారావు, షావుకార్ జానకీ, సావిత్రీ, గోవిందరాజుల సుబ్బారావు, సీ.యస్సార్ ఆంజనేయులు, పేకేటి శివరాం వంటి హేమాహేమీలతో వేదాంత రాఘవయ్య దర్శకత్వాన డి.యల్.నారాయణగారు వెండితెరకెక్కించడం జరిగింది. కళాపిపాసి ఎం.ఎస్.మూర్తి గారి చొరవతో రావికొండలరావు దర్శకత్వాన బుల్లితెరకెక్కించడం జరిగింది. అంతక్రితం జె.వి. సోమయాజులు, జె.వి.రమణమూర్తి ప్రభృతులు యీ నాటకాన్ని పలుచోట్ల ప్రదర్శించారు. గురజాడ వారి 'ముత్యాలసరాలు, పూర్ణమ్మ కథ, ఎన్నో ప్రాయోజిక రచనలూ, సమాజ సంస్కరణ వంటి ఈ మహాకవి మహోన్నతను రాష్ట్రవ్యాప్తం చేస్తూ, విశ్వవ్యాప్తం చేయవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతగానో ఉన్నది. సంవత్సరం పొడుగునా, గురజాడ ఉత్సవాలు జరపాలి. కేంద్ర ప్రభుత్వం కూడా బాధ్యత వహించేట్టు కేంద్రంలోని తెలుగు మంత్రులు పెద్ద యెత్తున ప్రయత్నించవలసి ఉన్నది. గురజాడ పేరిట తపాలా బిళ్ల విడుదల చేయాలి. రాష్ట్రప్రభుత్వం నిధులను కూర్చి గురజాడ రచనల్ని వాడవాడలా పంచాలి. పురావస్తు శాఖ ఆయన గృహాన్ని జాతీయ స్మారక చిహ్నంగా చేయాలి. అదే ఆయనకు నివాళి. ●



**శ్రీరామచంద్రుడు సాక్షాత్తూ మూర్తీభవించిన ధర్మదేవత!**

**శ్రీ రామాయణ గాథను ఒక్క గీతంలో కీర్తించిన అన్నమయ్య! అమేయ ప్రబంధవేత్త!**

రాముఁడిదే లోకాభిరాముఁడితడు
గోమున పరశురాము కోప మార్చెనటరే!
యీఁతడాతాటకిఁ జించె యీ పిన్ననాఁడె
అతల సుబాహుఁగొట్టి యజ్ఞముఁగాచె
చేతనే యీ కొమారుఁడా శివుని విల్లు విరిచె
సీతమ్మనుఁబెండ్లాడె చెప్పం గొత్తగదవె
మన కౌసల్య కొడుకా మాయామృగము నేసె
దనుజుల విరాధుని తానే చెఱిచె
తునుమాడె నేడుతాళ్లు తోడనే వాలి నడచె
యినకులఁడితడా యెంత కొత్త చూడరే!
యీ వయసు తానే యా యెక్కువ జలధి గట్టి
రావణు జంపి సీత మరలఁదెచ్చెను
శ్రీ వేంకటేశ్వరుఁడితఁడా సిరులనయోధ్య యేలే
కావున నాటికి నేడు కంటిమిట్టె కదరే –

– ఏఁవి భాషా సొగసు! ఏఁవి భావము! ఎంత నిగూఢ సంక్షిప్త కథనం! సంక్షిప్త సందర్భాలను సహితము సూక్ష్మదృష్టీయమగునట్టు పద సమాహారం ఎవరికి సాధ్యము? అందుకే అతడు అన్నమయ. అన్నమయ కోశం నిండేట్టు భక్తి సారాంశమపారం.

ఇరవై నాలుగు వేల శ్లోకాల 'వాల్మీకి రామాయణము'ను పన్నెండు పంక్తుల్లో నుడివి, మరి రెండు పంక్తుల్లో ఏడుకొండలవానితో రాముని బంధాన్ని అనుసంధించాడీ అన్నమయ్య!

లోకాభిరాముడీ రాముడే! పరశురాముని కోపాన్ని అణిచాడు. పిన్నతనము పన్నెండు, పధ్నాల్గు నిండేసరికి తాటకియనే బ్రహ్మరాక్షసిని పరిమార్చాడు. సుబాహుణ్ణి చంపి, మారీచుణ్ణి కొన్ని యోజనాల మేరకు తరిమి, విశ్వామిత్ర మహర్షి యాగ సంరక్షణం చేశాడు. ఆ మహర్షితో మిథిలకు చేరి, జనకుని ఇంట ఉన్న శివుడి విల్లును ఒక్కపెట్టున విరిచి, సీతను పెండ్లియాడాడు.

ఇంతకీ మన కౌసల్యారాముడు అడవిలో పర్ణశాల నుంచీ తప్పించుకుని పోతూన్న మాయలేడి రూపంలో ఉన్న మారీచుణ్ణీ విరాధుణ్ణీ సంహరించాడు. సప్తతాళ వృక్షాలను కూల్చి మహాబలిష్టుడైన వాలిని కూల్చాడు.

సూర్యవంశంలో జన్మించిన యీ వీరాధివీరుడు విశాలమైన మహాసాగరంపై వంతెనను నిర్మించి లంకకు వెళ్లాడు. సీతను చెరపట్టిన రావణుణ్ణి సంహరించి, సీతను విడిపించుకుని, అయోధ్యకు సీతతో వచ్చి రాజ్యమేలిన యీ రాముడేనమ్మా శ్రీనివాసుడు. ఈనాడు శ్రీ వేంకటేశ్వరుని రూపంలో దర్శిస్తున్నాం!

ఆహా! అన్నమయ్యది ఏఁవి అచంచల భక్తి, అక్షరముల అల్లికలోని అందచందములను చూచినప్పుడు బీజాక్షరములను పొదిగినట్టుంది. మరొకచోట శ్రీరాముని గుణవర్ణణ చేస్తూ – ఆ రాముడే, ఈ వేంకట విభుడన్న విధానాన్ని గమనించండి; భావభృకుటిని తెలుసుకోండి! ●

**ప్రపంచ ప్రసిద్ధిని గన్న తిరుమల తిరుపతి దేవస్థానం వారి 'సప్తగిరి' మాసపత్రికలో గోటేటి శ్రీరామారావు కలం నుంచీ వెలువడిన 'అధ్యాత్మ రామాయణం'ను ప్రస్తుతించింది!**

## వ్యాసకృత అధ్యాత్మ రామాయణం

**(తెలుగుసేత: శ్రీ గోటేటి శ్రీరామారావు; పుటలు: 301 పేజీలు, ధర: రూ.120/–; ప్రాప్తిస్థానం: రామరాజ్ పబ్లికేషన్స్, 64(16) తంబయ్య రెడ్డి స్ట్రీట్, వెస్టుమాంబళం, చెన్నై – 600 033).**

శ్రీరామనామ ప్రాశస్త్యాన్ని వివరించే దివ్యమంత్రాన్ని శివుడు పార్వతికి ఉపదేశించాడు. శివుడు పార్వతికి చెప్పిన బ్రహ్మాండ పురాణంలో 4200 శ్లోకాలతో విస్తరింపబడిన రామకథ అధ్యాత్మ రామాయణంగా ప్రసిద్ధి పొందింది. అధ్యాత్మ రామాయణం వాల్మీకి రామాయణ కథనే వివరిస్తూ, శ్రీరాముణ్ణి శ్రీమహావిష్ణువుగా, సీతను యోగమాయగా, మిగిలిన పాత్రలన్నిటిని ప్రత్యేక కార్యార్థం ప్రభవించినవిగా చూపింది. కౌసల్యా దశరథులు గత జన్మలో అదితీ కశ్యపులు. వారు విష్ణు పూజాతత్పరులై తపస్సు చేయగా విష్ణువు ప్రత్యక్షమైనాడు. వారు తనను తమకు పుత్రుడుగా పుట్టుమని కోరారు. ఆ పరంధాముడే రాముడుగా పుట్టాడు. వాల్మీకి రామాయణంలో రాముడు సామాన్య మానవుడుగా ప్రవర్తిస్తాడు. అధ్యాత్మ రామాయణంలో తానే పరమాత్మనని, తనను శరణు పొందితే సంసార సాగరం నుండి ఉద్ధరిస్తానని అభయ ప్రదానం చేశాడు. రామనామ మహిమవల్లే తాను మహర్షి అయినట్లు చెబుతాడు వాల్మీకి. రామా! మీ జ్ఞానాగ్ని రూపమైన ఖడ్గంతో నాకున్న పుత్రధనాది స్నేహబంధాలను ఖండించమంటుంది కైకేయి.

రామాయణ కథా మూలంగా భగవత్తత్త్వాన్ని, ఆత్మతత్త్వాన్ని అర్థం చేసుకోవడానికి శ్రీ గోటేటి శ్రీరామారావుగారి ఈ గ్రంథం ఎంతగానో ఉపకరిస్తుంది. గోటేటివారు వ్యాసకృతమైన అధ్యాత్మ రామాయణాన్ని యథాతథంగా తెలుగు వచనంగా వెలయించారు. వారి భాష సరళంగాను, విషయం స్పష్టంగాను ఉంది. చదివిన వారికి రామాయణ రహస్యాలతో పాటు ఆత్మతత్త్వం బాగా బోధపడుతుంది. రచయిత మూల గ్రంథంలోని ప్రతి విషయాన్ని జారిపోనీకుండా తెలుగులోనికి తెచ్చి పాఠకులకు మూలగ్రంథం చదివినంత అనుభూతిని కలిగించారు. ముముక్షువులైన చదువరులు వారి కృషిని తప్పక అభినందిస్తారు. అందరూ తప్పక చదవాల్సిన గ్రంథమిది.

– డా॥ గల్లా చలపతి



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



75

## పదకొండవవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ.

అర్జున ఉవాచ :-

1. మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్
   యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ.
2. భవాస్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశోమయా
   త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్.
3. ఏవమేతద్యథాఽత్థ త్వమాత్మానం పరమేశ్వర
   ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ.
4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో
   యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్.

శ్రీ భగవానువాచ :-

5. పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః
   నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీనిచ.
6. పశ్యాదిత్యాన్ పసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా
   బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత.
7. ఇహైకసథం జగత్కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్
   మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టు మిచ్ఛసి.

**వ్యాఖ్య :-** ' విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితోజగత్ ' - అని భగవాను డిదివరలో (విభూతియోగముచివర) చెప్పినచందమున ఈ సమస్తబ్రహ్మాండములతో గూడిన చరాచరజగత్తంతయు. పరమాత్మయొక్క ఒకానొక అంశమునందే ఇమిడి యున్నదగును. కావుననే తనయొక్క అనంతదేహమున (స్వరూపమున) ఈ విశ్వమునంతను ఒకనొక చోట (అవయవమువలె) నున్నదానినిగా వీక్షింపవలసి నదిగా శ్రీకృష్టపరమాత్మ అర్జుననకిచట తెలిపిరి. దీనినిబట్టి పరమాత్మయొక్క స్వరూప మెంత విశాలమైనదో, అనంతమైనదో యోచించుకొనవచ్చును. భూతాకాశమే ఎంతయో విస్తృతమైనది; సూక్ష్మమైనది. దానికంటె చిత్తాకాశము ఇంకను విస్తృతమై, సూక్ష్మతరమైయున్నది. దానికంటె చిదాకాశము (ఆత్మ) ఇంకను విశాలమై, సూక్ష్మతమమై వెలయుచున్నది. కావున అట్టి చిదాకాశమునందు ఈ భూతాకాశము, దానియందెచటనో అణగియున్న ఈ చరాచరజగత్తుగాని ఏపాటిది? కనుకనే ఆ చిదాకాశమున (ఆత్మయందు) ఈ సమస్తప్రపంచము ఎక్కడో ఒకమూల (కల్పితమై) అణగి యున్నదని భగవాను డిచట నుడివిరి.

ఇట్టి అనంతరూపుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమంతుడునగు పరమాత్మను అల్పుడును, పరిచ్ఛిన్నుడును, దేశకాలాదులకు వశుడును నగు ఈజీవుడు భక్తిప్రపత్తులుగలిగి వినయవిధేయుడై నేవించుట ధర్మము. ఈ ప్రకారముగ ఆ సమష్టిరూప పరమాత్మను సేవించుటచే వారి యనుగ్రహమువలన జ్ఞానమునుబడసి వారిలో ఐక్యమొంది తరించుటకు అవకాశముండును. లేకున్న ఈ జననమరణ ప్రవాహమున తగుల్కొని జీవుడు ఇంకెంతకాలమో దుఃఖములపాల్పడవలసి యున్నది.

మనుజున కెపుడైన తనయొక్క ధన, జన, క్షేత్ర, అధికారాదులగూర్చిన అహంకారము, గర్వము కలిగినచో అత్తఱి ఈశ్లోకమును చక్కగ మననము చేసినచో ఆ గర్వములన్నియు ఉడిగిపోగలవు. ఏలయనిన, 'ఈ విశాలజగత్తంతయు ఎద్దానియందొకమూల కల్పితమై అణుమాత్రముగ భాసించుచున్నదో అట్టి పరమాత్మయొక్క అనంతరూపమున ఈ నా ధనముగాని, బలముగాని, పరిజనముగాని, అధికారముగాని ఏమూలకు? కావున వానినిజూచి ఏల గర్వపడవలెను?' అను భావ మాతనికపుడు కలుగగా భగవంతునియెడల భక్తిభావ ముత్పన్నమగును. మఱియు అల్పములగు ఈ దృశ్యపదార్థములయెడల విరాగము జనించును.

8. న తు మాం శక్యసేఽ ద్రష్టుమనేనైవ స్వచక్షుషా
   దివ్యం దదామి తే చక్షుః వశ్య మే యోగమైశ్వరమ్.

**వ్యాఖ్య :-** భగవంతు డేల కనుపించుటలేదను ప్రశ్నకిచట సమాధానము చెప్పబడినది. ఈచర్మచక్షువులచే (స్థూలనేత్రములచే) మనుజుడు అతిసూక్ష్మమైన పరమాత్మను చూడజాలడు. సామాన్యాకాశమునే ఈనేత్రములచే చూడజాలనపుడు ఇక సూక్ష్మాతి సూక్ష్మమైన చిదాకాశమును (పరమాత్మను) ఎట్లు చూడగలడు? పంచభూతాత్మకమగు నేత్రము పాంచభౌతిక పదార్థములనే చూడగలదుగాని, చిన్మయ ఆత్మవస్తువునుగాదు. కావున పరమాత్మను దర్శింపవలెననిన జ్ఞాననేత్రము, దివ్యదృష్టి అవసరమైయున్నది.

'దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః' "సూక్ష్మమగు ఏకాగ్రబుద్ధితో తత్త్వవేత్తలచే పరమాత్మ చూడబడుచున్నాడు. (అనుభూతమగుచున్నాడు)". అను శ్రుతివాక్య మీ సత్యమునే వెల్లడించుచున్నది. భగవానుడు సర్వత్ర వ్యాపించియుండి ప్రత్యక్షముగనే యున్నారుకాని జనులకంటికి పొర (అజ్ఞానము) కప్పబడియుండుట వలన వారాతనిని చూడజాలకున్నారు. అదియే మాయాయవనిక; అదియే అజ్ఞానతిమిరము. దానిని జ్ఞానాంజనముచే తుడిచివేసినచో పరమాత్మను ప్రత్యక్షముగ దర్శింపగలరు.

**సర్వగం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుర్నిరీక్షతే**
**అజ్ఞానచక్షుర్నేక్షత భాస్వన్తం భానుమన్ధవత్** (శ్రీ శంకరాచార్యులవారు - ఆత్మబోధ)

'సర్వవ్యాపకమగు సచ్చిదానందపరబ్రహ్మమును జ్ఞాననేత్రముతోనే మనుజుడు చూడగలరు. ప్రకాశించుచున్న సూర్యుని గ్రుడ్డివాడు చూడజాలనట్లు అజ్ఞాననేత్రు డాతనిని వీక్షింపజాలడు'.

'దేవుడు మాకంటికి కనుపించుటలేదు. కావున ఆతడు లేడ'ని వాదించుట గ్రుడ్డివారు సూర్యుడులేడని వాదించుటవంటిదే యగును. కాబట్టి భగవద్దర్శనమునకు దైవానుభూతికి జ్ఞాననేత్రమును, దివ్యదృష్టిని సంపాదించవలెను. అయితే, అది యెట్లు లభించును? భగవత్కరుణచే. 'దదామితేచక్షుః' - అని భగవానుడు చెప్పుటబట్టి దానిని వారివ్వవలసి నదే. కాని, అందఱికిని దాని నిచ్చునా? కాదు. ఎవరు అనన్యభక్తి గలిగి వారిని ధ్యానించుదురో, సేవించుదురో వారికి మాత్రమే ఇచ్చును. అర్జునుడట్టి అర్హతను సంపాదించుకొనెను గనుక ఆతనికి లభించినది. అట్లే ఎవరైనను సరియే అట్టి భక్తిప్రపత్తులుగలిగి భగవానుని ప్రీతితో సేవించినచో, ధ్యానించినచో వారికిన్ని అది తప్పక లభించును. "తేషాం సతతయుక్తానాం... దదామిబుద్ధియోగం..." (10-10) అను విభూతియోగమందలి శ్లోకమున్ను యా తత్త్వమును ప్రతిపాదించుచున్నది. భూతద్దము అమర్చబడిన కండ్లజోడును ధరించినచో జలమందు, స్థలమందు, ఆకాశమందుగల అతిసూక్ష్ములైన పదార్థములు గోచరించును. మామూలు కండ్ల కవి కానరావు. ఆ అద్దమును బీదవాడు ధరించినను ఎవరు ధరించినప్పటికిని ఆ సూక్ష్మవస్తువులు గోచరించును. దానిని ధరింపనిచో ధనవంతుడైనను, ఉన్నతకులసంజాతు డైనను, పురుషుడైనను, మహాపండితుడైనను వారికి ఆ వస్తువులు కనిపించవు. అట్లే జ్ఞాననేత్రము (దివ్యదృష్టి) అను కండ్లజోడు ధరించినవారికే పరమాత్మ ప్రత్యక్షమగును. ఆత డెట్టిజాతివాడైనను, ఎట్టి అంతస్తునందున్నను సరియే. భగవద్దర్శనమున కుపకరించు ఆ కండ్లజోడును సర్వేశ్వరుడే ప్రసాదించగలడు (భక్త్యాదులు గలిగియున్నచో). కాబట్టి ఆ వస్తువును సంపాదింపకపోయినచో అది ఎవరి దోషము? వారి వారి దోషమేయగును. దేవుడు కానరాకపోవుటకు కారణము జీవులయొక్క ప్రయత్నరాహిత్యమే యగును. కాబట్టి సర్వులును గీతయందు తెలుపబడిన భక్త్యాది, అమానిత్వాది, అద్వేష్టృత్వాది, అభయాది సుగుణములను ప్రయత్నపూర్వకముగ సంపాదించి భగవత్కటాక్షమును, తద్ద్వారా జ్ఞాననేత్రమును, తద్ద్వారా బ్రహ్మసాయుజ్యమును పొందవలెను.

'దివ్యత్' - దైవసంబంధమైనది - 'దైవసంపత్తి' ద్వారా లభించునది.

-(తరువాయి వచ్చే సంచికలో)

# దేశికోత్తముడు సద్గురు శివానందమూర్తి

విశాఖపట్టణం సమీపంగా భీమునిపట్నంలో గల ఆనందవనం ఒక శంకర భగవత్పాదులు, ఓ స్వామి వివేకానంద వంటి అంశా స్వరూపులు వెలసిన మహాపుణ్యప్రదేశమనే చెప్పాలి. ఆ పీఠాధీశుడు సద్గురు కందుకూరి శివానందమూర్తి 'భారతీయత' మూర్తీభవించిన సనాతన ధర్మమూర్తి. సాక్షాత్తూ పరమ శివుడే అక్కడ అవతరించారని అసంఖ్యాక భక్తుల విశ్వాసం. దేశికోత్తమ గురువుగా ఎప్పుడో ఆయనకు వేదమాత పట్టం కట్టింది.



సద్గురు శివానందమూర్తికి దేశికోత్తమ బిరుదు ప్రదానం చేస్తున్న దృశ్యం

భారతీయ సంప్రదాయాన్నీ, మహర్షుల జీవితాలను ఆయన గ్రంధస్థం చేశారు. 'సుపధ' అనే పత్రిక ద్వారా సుపథగామి అయ్యారు. సంగీత, సాహిత్యాలు, వేదోపనిషత్తులు ఆయనకు కరతలామలకం. ఆయనకు తెలియని ధర్మశాస్త్రం లేదు. నోరు తెరిచి అడగకపోయినా, ఆర్తి మనస్సు గ్రహించి, రెండు చేతులా దానం చేస్తున్న సుగుణదానశీలి.

ఆయన దానశీలత, కళాపోషణ, జ్ఞానసంపద, భాషాపారంగతులను మెచ్చిన కంచి కామకోటి జగద్గురువులు జయేంద్ర విజయేంద్ర సరస్వతీ స్వాములు. విశాఖ కంచి మఠం శాఖ ద్వారా, వారికి 'దేశికోత్తమ' బిరుద ప్రదానం చేశారని విని, అమితానందకందితు ణ్ణయ్యాను.



హైదరాబాద్ తెలుగు లలిత కళాతోరణంలో సర్వార్థ సంక్షేమ సమితి నిర్వహించిన 'ధర్మరక్షణ శంఖారావం'లో వారి సందేశం వినిపిస్తున్న సద్గురు శివానందమూర్తి.

ఆయన్ను ఘనంగా వేద స్వస్తితో శంకరమఠానికి ఊరేగింపుగా తీసుకుని వచ్చి, పురుష సూక్తవిధానంతో ఆయనకు పాదపూజను చేసి, ప్రణతులర్పిస్తూ, విశాఖ శంకర మఠం అధ్యక్షులు లంక విశ్వనాధంగారు, జగద్గురువులు ఆదేశానుసారంగా 'దేశికోత్తమ' బిరుద ప్రదానంతో సత్కరించారు. విశాఖపట్టణంలోని ఎందరో పెద్దలు, భక్తులు, సద్గురు శివానందమూర్తి మహోదయుల పట్ల భక్త్యాంజలి ఘటించడం ఆంధ్రదేశ చరిత్రలోనే ప్రప్రథమం. అస్మద్గురువరేణ్యులైన సద్గురు శివానందమూర్తి గారి పాదపద్మాలకు ప్రముఖాంధ్ర అంజలి ఘటిస్తూంది. కన్నుమూస్తే శివధ్యానం, కన్ను తెరిస్తే దేశభక్తే ప్రతీ ఒకరిలో కుసుమించాలన్న వారి సందేశాన్ని అందరూ పాటించాలి. ●

# మద్రాసులో ఆర్యవైశ్య ప్రముఖుడే స్వాతంత్ర్యోద్యమం, పత్రిక ప్రారంభించాడు!!

## - అప్పటికింకా మద్రాసు ఉమ్మడి రాష్ట్రంగానే ఉంది! -

**చెన్నపట్నంలోని లక్ష్మీ నరసుచెట్టి గారనే ఆంధ్ర ఆర్యవైశ్యుని నరనరాల్లోనూ దేశ స్వాతంత్ర్యోద్యమం పారుతూండేది. ఆయన స్థానికుల్లో స్వాతంత్ర్యోద్యమం మొలకలు నాటటం కోసం స్థానికుల సభలు ఏర్పాటు చేయడంతోబాటు 'క్రిసెంటు' అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించి, ప్రజా సమస్యలు గురించి తెలిపిన తొలి తెలుగు ఆర్యవైశ్యుడు. వ్యాపారం చేస్తూనే ఉద్యమానికి నాందీ పలికినవాడు!**

భారత స్వాతంత్ర్యోద్యమం చాలా ప్రాంతాల్లో (అప్పటి రాష్ట్రాలు) జరుగుతున్న దానికన్నా ఆంధ్రులున్న ప్రాంతాల్లో జరుగుతూండేది. అప్పటికి ఆంధ్రుల నివాస ప్రదేశం మద్రాసు. ప్రాదేశికంగా చూస్తే ఆర్యవైశ్యులకు దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమ గరిష్టత ఎక్కువగా వుండేది.

వాళ్లు ఒక చేత్తో వ్యాపారం ధర్మకార్యాలూ చేసుకుంటూ, మరోచేత్తో స్వాతంత్ర్యోద్యమాలూ చేస్తూండేవారు. జార్జి టౌను అనబడే ఇప్పటి ప్రాంతాన్ని షావుకారుపేట అనేవారు. ఆదికేశవులు చెట్టివీధి, గోవిందప్పచెట్టి వీధి, గిడ్డంగు వీధి, మలయపెరుమాళ్ చెట్టి వీధి, కొండిచెట్టి వీధి, సుంకురామ చెట్టి వీధి, తంబుచెట్టి వీధి, లింగుచెట్టి వీధి – ఇలా లెక్కగట్టలేని వీధులు, ఆర్యవైశ్యుల పేరిట షావుకారు పేటలో, చాకలిపేటలోనూ, తండియార్పేటలోనూ, మాంబళంలో, సైదాపేటలో, మైలాపూర్ల్లో, తిరువళిక్కేణిలో పలుచోట్ల చిన్నచిన్న గ్రామాలుగా ఉండేవి. కొత్వాలు మార్కెట్, ఆ మార్కెట్కు చుట్టూ ఉన్న ప్రదేశం, ఇటు రిప్పన్ బిల్డింగ్సు, హైకోర్టు, అటు ఫస్టు లైన్ బీచ్ నుంచీ మింట్ వరకూ ఉన్న ప్రాంతాల్లో తెలుగు ఆర్యవైశ్యులు ఎక్కువగా ఉండేవారు. షాహుకార్లు అంటే వ్యాపారులు. ఆ వ్యాపారులు ధర్మపరులూ, దేశభక్తి, దైవభక్తిపరులైనందున వారికి 'ఆర్య' పదం చేర్చబడింది. ఆర్యవైశ్యులుగా పిలువబడ్డారు. వారే ఇటు కర్నాటకకూ, అటు సేలం కోయంబత్తూరులకూ వలస వెళ్లారు. అయిననూ విడిగా వెళ్లిపోయిన, వారందరి భాషల వైశ్యులతో వివాహ సంబంధ బాంధవ్యాలను కలుపుకోవడం వలన వారిలో తెలుగు వ్రాయడమూ సన్నగిల్లిపోయింది. షావుకారుపేట లోని కొత్వాలు మార్కెట్లోనే ఆర్యవైశ్యులు ఆరాధన కుల దేవత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయం ఇప్పటికినీ అక్కడనే ఉన్నది. మద్రాసులో ఎక్కడున్నా ఆర్యవైశ్యులు ఇక్కడున్న ఆలయానికే వచ్చి పూజలు చేసేవారు. వాసవీ దేవీ ఆహుతీ పర్వం రోజున ఆర్యవైశ్యులు అగ్నిగుండం త్రొక్కేవారు. ఇప్పటికీ ఆ ఆచారం కొనసాగుతూంది. కొంతమంది చదువుకొని ఉద్యోగాలు చేసినప్పటికినీ కొందరు వంశపారంపర్యమైన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఈ లక్ష్మీనరసు చెట్టియనే తెలుగు వైశ్య ప్రముఖుడు 19వ శతాబ్దపు ప్రారంభ రోజుల్లో, పౌరుల్లో స్వాతంత్ర్యోద్యమ భావాలకు మొలకలు వేసారు. జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. వందేమాతరమ్ గీతానికి ప్రాచుర్యం కల్పించారు. మరికొందరు తెలుగువారితో కలిసి స్థానికుల సభను ప్రారంభించారు. అటు తరువాత మద్రాసు మహాజన సభను ప్రారంభించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లడానికి ఓ వేదిక ఏర్పరిచారు. దాని అధ్యక్ష, కార్యదర్శులందరూ తెలుగువారే!

భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడక ముందే లక్ష్మీనరసుచెట్టి ఇన్ని పనులు చేశారంటే ఆయన ఎంత ఘనుడో, ఘనఘనాతి ఆర్యధర్మపువైశ్యుడో గ్రహించండి. తన ఆశయాలన్నిటినీ పౌరుల్లో గొనిపోవడానికి క్రీసెంట్ పత్రికను స్థాపించాడు. ఈయన స్థాపించిన మద్రాసు మహాజన సభలో ఆంధ్ర ప్రాంతం నుంచీ రంగయ్యానాయుడు, ఆనందాచార్యులు వంటి వారు ఎందరో పాల్గొన్నారు. వీరి ప్రచార ప్రసార ప్రభావంతో కాకినాడలో సాహితీ సభ జరిగింది. శతపత్ర రేకుల పుష్పాల్లా జాతీయ భావాలు వికసించాయ్. 1885 ప్రాంతంలోనే 'ఆంధ్రప్రకాశిక' అనే రాజకీయ పత్రిక ప్రారంభమైంది. ఆయన దేశ భక్తి ప్రభావం కృష్ణా గోదావరీ తీరముల వరకూ ప్రాకింది. అప్పట్లో తెలుగులో ఇరవై పత్రికల వరకూ ప్రారంభమయ్యాయి. ఆయన వంటి చేతితో 'శాల్యూట్'గా నమస్కారం పెట్టేవాడు కాదు రెండు చేతులా నమస్కరించే ఆర్యధర్మ పిపాసి. ఆయన్నొక్కసారి స్మరించుకోవడం ఇప్పటివారందరి కర్తవ్యం, ధర్మం. వారికి మా వందన శతములు. ●

# వేద, పురాణేతిహాసలందు ఆసక్తి చూపిన భీమరాజు శ్రీనివాసరావు పంతులు

**మా** తాతగారు, లేట్ శ్రీ భీమరాజు శ్రీనివాసరావుగారు ఆంధ్రప్రదేశ్ గుంటూరు వాస్తవ్యులు. బ్రిటీష్ పరిపాలనలో సబ్–మెజిస్ట్రేట్ మరియు మొదటి టౌన్ సేల్స్ ట్యాక్స్ ఆఫీసర్ వంటి పెద్ద పదవులు నిర్వహించారు. ఆ కాలంలో ఆయన బి.ఏ., బి.ఎల్. పట్టాలు మద్రాసు విశ్వవిద్యాలయంలో గవర్నర్ చేతులు మీదుగా పొందిన పండితుడు, పదవీ విరమణ లాయర్‌గా పేరు ప్రఖ్యాతులు పొందారు. బ్రిటీష్ దొరల మన్ననలు పొందారు.



ఇంగ్లీషు, సంస్కృతం, తెలుగు భాషలలో దిట్ట. తమిళం కూడా మాట్లాడేవారు. లాటిన్ భాష కూడా వారికి వచ్చు. వక్తగా మత సాహిత్యంపై అనర్గళంగా మాట్లాడేవారు. వేద, వేదాంతాలు, రామాయణ, భాగవత, భారతాది గ్రంథాలు క్షుణ్ణంగా పఠించేవారు. తను ప్రచురించిన కొన్ని పుస్తకాల్ని ఉచితంగా నల్గురికీ పంచిపెట్టారు.

హోమియోవైద్యంలో చాలా కీర్తి గడించారు. దీర్ఘ వ్యాధిగ్రస్తుల కొరకు తీవ్రమైన రీసెర్చ్ చేశారు. వారి 82–83 సం॥ల వయసులో కూడా ఉచిత హోమియో వైద్యాన్ని వదల్లేదు. పేషంట్ల గురించి తన డైరీల్లో రాసుకునేవారు. ఆయన డైరిలోని ప్రతి పేజీ బ్రహ్మాండమైన వర్ణన, కథనంతో ఉండేది.

తెలుగు నియోగి బ్రాహ్మణుడుగా పుట్టి గుంటూరులో ఆయన శ్రీ వైష్ణవం పుచ్చుకున్నారు. వారి గురువు ఆంధ్ర వాల్మీకి, వాసుదేవస్వామివారు. వారి వద్ద తాతగారు చక్రాంకితులయ్యారు. అపర రామభక్తుడు. సుందరకాండ పారాయణలతో వారింట్లో శ్రీరామనవమి, సీతారాముల ఉత్సవాలు ఘనంగా జరిపిస్తూండేవారు. ఆ శుభఘడియాల్లో వారింట్లో బంధువుల వివాహాలు కూడా జరిపించారని మా అమ్మగారు చెప్తుండేవారు. వారి తమ్ముని పిల్లలను, ముఖ్యంగా మా అమ్మను తన వద్దే పెంచి పెద్దచేశారు. మా అమ్మగార్ని రెండేండ్ల వయసుకే తన యింటికి మురిపాల ఆడబిడ్డగా తెచ్చుకుని సంగీతంలో ఫిడేల్ నేర్పించారు. శ్రీనివాసరావుగారి తమ్ముడు హనుమంతరావు, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్‌గా బ్రిటీష్‌వారి కాలంలో పనిచేశారు. వారిద్దరు లక్ష్మి వాళ్ళ చెల్లెలు శ్రీమతి సుబ్బాయమ్మ శ్రీనివాసరావుగారి ధర్మపత్ని. వారిద్దరికి ప్రేమ వారధి. వారికి ముందే 1966 సం॥లో స్వర్గస్థులైయ్యారు. ఆమె తన పేరు "అనసూయ"కు ధీటుగా నడుచుకున్న పతివ్రత. పంతులుగారు 1969–70లో శ్రీరాముని సన్నిధి చేరారు.

త్యాగరాజు కీర్తనల్లో, వాల్మీకి రామాయణంలో, వేదాల్లో, పురాణేతిహాసాల్లో ప్రవేశం కల పరమ పురుషుడు, ఆయనే సాక్షాత్ శ్రీరామచంద్ర పరబ్రహ్మమని చాలా నైపుణ్యంతో చిత్రీకరించారు శ్రీనివాసరావుగారు. వారి బృహత్ గ్రంథం "శ్రీ త్యాగరాజవేద సారగానసుధ" వేణుగాన నాదామృతం. యిదొక గోదాగోవింద తన్మయత్వ పూరిత రాగ రస నాద నీరాజనం. యెప్పుడో శ్రీరామపాదాంకితం చేశారు.

నాదబ్రహ్మ శబ్దబ్రహ్మ, పరబ్రహ్మవేరుగారని శ్రీనివాసరావు గారు వక్కాణించారు. నాదోపాసన చాలా కష్టతరమని, పేదల నుండి పండితుల వరకు భజన, భక్తిమార్గాల్లో భగవంతుని పొందవచ్చని, రామదాసు, త్యాగయ్య, పురంధరదాసు వంటి మహనీయులువలె మనం భక్తిమార్గాన్ని అనుసరించాలని తాతగారు యెంతో తపనపడిన హృదయంతో చక్కగా అనేక విశేషాద్భుతాలు రాసారు. ధనాపేక్ష, కీర్తికాంక్ష అంటే నిజంగా తెల్సుకోనవసరంలేని, తెల్సుకోని అపర రామభక్తుడు. బంధువులకు, స్నేహితులకు వీరంటే యెంత ఇష్టమో అంత భయం. దుష్టులపాలిట ఆయన నరసింహావతారం. బిడ్డలయెడల పరమ ప్రేమమూర్తి.

వారి పెద్ద మనుమడు డా॥కె.యస్.ఆర్.మూర్తి, తి.తి.దేవస్థానముల కాలేజీలలో ప్రిన్సిపల్ మరియు డి.ఇ.ఓ. పదవులు పొందగలిగారు. అది శ్రీనివాస పరబ్రహ్మ కరుణాకటాక్షం. రెండవ మనుమడు శ్రీనివాసమూర్తి అచ్చుగా తాతవలె శ్రీవైష్ణవుడిగా బ్రతికాడు. గుంటూరులో ప్రఖ్యాతి పొందుతున్న తరుణంలో 50 ఏళ్ళకే విష్ణుపాదంలో కల్సిపోయారు. చివరి మనుమడు శ్రీరంగనాథమూర్తి గుంటూరులో లేబర్ అడ్వయిజర్‌గా పనిచేస్తున్నారు. ఈ ముద్దుల మనుమడు తాతగారి నివాస స్థలాన్ని (బ్రాడిపేట,గుంటూరు) అందమైన వ్యాపార కేంద్రంగా మార్చగలిగాడు. శ్రీరాముని కృపతో ప్రతిసంవత్సరం తాతగారి స్థలంలో సీతారామకళ్యాణం, సుందరాకాండ పారాయణ జరిపిస్తాడు బంధుమిత్రులకు భోజన తాంబూలాది శ్రీరామప్రసాదాన్ని అందిస్తాడు. అది తాతగారి ఆస్తికి గల స్థలవిశేషం అంటాడు.

శ్రీనివాసరావుగారికి గుంటూరులో చాలాకాలం క్రితం పరమపదించిన పూర్వపు ఆంధ్ర ఆస్థాన కవి శ్రీ కాశీ కృష్ణమాచార్యులు గారు పరమ ఆప్తులు. వారిరువురు పరస్పరం శ్రీవైష్ణవ సాంప్రదాయాలు, పాండిత్యము గురించి చర్చించుకోవడం నాకు ఇప్పటికీ గుర్తుంది. కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారు, శ్రీనివాసరావుగారిని గొప్ప రామభక్తుడని కొనియాడ్డారు.

వారి గ్రంథం "త్యాగరాజవేదసారగానసుధ" పలువురి పెద్దల ప్రశంసల్ని పొందింది.

ఈ మహత్తర గ్రంథం నుండి దాదాపు 7, 8 పి.హెచ్.డి అంశాలు తీసుకోవచ్చని సంస్కృతాంధ్ర పండితుల, ఉపాధ్యాయుల అభిప్రాయం. ఇప్పటికే మొదటి అధ్యాయం నుండి ఒక యం.ఫిల్ ఉద్భవించింది. ఇటువంటి అమూల్య గ్రంధాన్ని ముద్రణం చేసి శ్రీవేంకటేశ్వరుడు, అలిమేలు మంగమ్మ జగజ్జననిల కరుణా కటాక్షంతో అమ్మపాదాల వద్ద ఉంచాలని నేను, మా తమ్ముడు, మా శ్రీ వేంకట రాముడిని వేడుకుంటున్నాం. అచ్చయిన గ్రంథాన్ని విక్రయానికి పెట్టకుండా పెద్దపెద్ద పండితులకూ, పీఠాధిపతులకూ, విశ్వవిద్యాలయాలకూ ఉచితంగానే యివ్వాలని మా సంకల్పమని ప్రముఖాంధ్ర పత్రికద్వారా వెల్లడించడం ఆనందంగా ఉంది.

**శ్రీనివాసరావుగారి మనుమలు**
**కె.శ్రీరామచంద్రమూర్తి, లేట్ కె.శ్రీనివాసమూర్తి,**
**కె.శ్రీరంగనాథమూర్తి**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"

### వంద సంవత్సరముల పంచాంగం కూర్చిన ప్రముఖ సిద్ధాంతి

# బుట్టే వీరభద్ర దైవజ్ఞ!!

- పిడపర్తి వారి శిష్యుడు -

గురువులు పోయిననూ గురువు గురుతుల్ని మరువని శిష్యులు పది కాలాలపాటు కీర్తిప్రతిష్ఠలనార్జిస్తారు. అందునా ఈ శిష్యుడు గురువరుల శతవర్ధంతిని ఘనంగా జరిపి, గురుఋణం తీర్చుకున్నాడు.

పిడపర్తి పెద్దపూర్ణయ్య గారి శిష్యుడనని గర్వంగా, సంతోషంగా, చెప్పుకొనే బుట్టే వీరభద్ర దైవజ్ఞ పేరుమోసిన పంచాంగకర్త. 'పంచాంగం కూర్చడం అంత సులభంకాదు. గ్రహగతుల గణితాన్ని బిందు ప్రమాణంతో లెఖ్ఖగట్టాలి. పంచాంగ కర్తలది కఠోర శ్రమ. వారికి జ్యోతిష్య శాస్త్రము, ఖగోళ విషయాల్లో ప్రావీణ్యత ఉండాలి. ముఖ్యంగా గురు అనుగ్రహమూ, దైవానుగ్రహమూ ఉండాలి. నవగ్రహనాధుల అనుగ్రహం ఉండాలి.

ఈ విషయంగా జ్యోతిష్యమంటే ఎరుగని, నమ్మని, తెల్లదొరలు, అందునా న్యాయాధీశుడైనవాణ్ణి, వాని ప్రశ్నకు వాని ముందే వ్రాసి కవరు మూతకు సీలువేసి, ఆ దొరకే ఆశ్చర్యమూ, ఆనందమూ గూర్చిన ప్రసిద్ధ పంచాంగకర్తలూ, జ్యోతిష్య శాస్త్రప్రవీణులైన పిడపర్తి వారి వంశ ప్రదీపకుడు పిడపర్తి పెద్దపూర్ణయ్య సిద్ధాంతిగారి ప్రియ శిష్యుడీ బుట్టే వీరభద్ర దైవజ్ఞ. దైవభక్తీ, వినయ స్వభావమూ కలవాడు. గంటల పంచాంగం కూర్చడంలో ఘనాపాటీ. బుట్టేవారి కొత్త సాంవత్సరిక పంచాంగం ఎప్పుడు వస్తుందాయని లక్షలాది అభిమానులు వేయి కళ్లతో ఎదురుచూస్తూ ఉంటారు. చాంద్రమాన లక్ష్యంతో, సాంప్రదాయంతో కూడుకున్న వీరి పంచాంగం లక్షల్లో విక్రయింపబడుతుందని విన్నాను. ఆయనకు మేమన్నా, 'ప్రముఖాంధ్ర' అన్నా విలువగల ప్రేమ అభిమానం.

వారు మద్రాసులో మా గృహానికి వచ్చి, వంద సంవత్సరాల పంచాంగం ప్రతిని యిచ్చి ఆనందింపజేశారు. ఆశ్చర్యపరిచారు. వీరభద్ర దైవజ్ఞ మోములో ఏదో కాంతివంతమైన బ్రహ్మతేజస్సు ఉన్నది. గురు అనుగ్రహంతో బాటు, వరాహమిహిరుని అనుగ్రహం, శివానుగ్రహములున్నవనుటకు ఆయన ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీశైల దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి కావడమే!

తూర్పు గోదావరి జిల్లా, అమలాపురం తాలూకా బండారులంక గ్రామంలో వేంకట సుబ్బయ్య – సూర్యకాంతం దంపతులకు 1962 సం॥ము ఏప్రిల్ 7వ తేదీన జననమందిన వీరభద్ర దైవజ్ఞ, బండారులంక ఉన్నత పాఠశాలలోని ఎస్.ఎస్.సి. ఉత్తీర్ణుడై, ప్రఖ్యాత జ్యోతిష్య పండితులైన శ్రీ పిడపర్తి పెదపూర్ణయ్య సిద్ధాంతిగారి శిష్యరికంలో పంచాంగగణితం, జ్యోతిష్యశాస్త్రము, ధర్మశాస్త్రం, హోరా, సంహితములను, వాస్తుశాస్త్రమును కూలంకషంగా వంటబట్టించుకున్నారు. 1989 నుంచీ రాజమండ్రీ నివాసమేర్పరచుకుని, పంచాంగ గణనం చేసి పంచాంగములు ప్రచురిస్తూ, ఆంధ్ర రాష్ట్రములో అత్యధికముగా తన పంచాంగములు విక్రయించేట్టు బహుముఖ ప్రచారమందిన బుట్టే వీరభద్ర దైవజ్ఞ వాక్సుద్ధిగల జ్యోతిష్యశాస్త్రవేత్తగా విశిష్ట స్థానాన్ని సంపాదించారు.

వీరి పంచాంగంలో జాతకచక్రం వేయడమెలా? భృగు సూత్రాలూ, సంఖ్యాశాస్త్రమూ మున్నగు అనేక విషయాలను క్రోడీకరించి వేయడమేగాకుండా, జన్మ నక్షత్రానుసారంగా ముహూర్తములు పెట్టడం, ఆ ముహూర్త కాలలో విజయవంతంగా శుభకార్యములు జరగడం జరుగుతూన్న సత్యం.

జ్యోతిష్యునికి వాక్సుద్ధి ప్రధానం. 1996 సం॥ము అక్టోబర్ 17న రాజమండ్రి దేవీ ఉత్సవ సంఘం వారు దేవిన్నవరాత్రుల సందర్భంలో వీరిని పుష్పాలంకృత రథంపై అధిష్టింపచేసి, పురవీధుల్లో ఊరేగించి, ఘనసత్కారం చేయడం,



బండారులంక గ్రామంలో వందలాది కవులు, పండితుల సమక్షంలో రజిత కిరీటమూ, సువర్ణ కంకణంతో సత్కరించడం ఇలా ఎన్నో ఆంధ్రప్రదేశ్‌లోని ఘన సత్కారములు జరిగాయ్. జ్యోతిష్య సార్వభౌమ దైవజ్ఞ భూషణ ఇత్యాది బిరుదులతో సత్కరించడం, టి.వి.లందు వీరి గోష్ఠులు ప్రసారం కావడం విశేషం. వీరు జ్యోతిష్య పాఠశాలను నెలకొల్పి ఎందరికో ఉచిత భోజన వసతులుతో, ఖగోళశాస్త్రము, జ్యోతిషశాస్త్రముల నేర్పడం బహుదా ప్రశంసించదగినది. ఆంధ్రదేశంలో యజ్ఞయోగాదులు చేయించడంలో కూడా వీరి ప్రసిద్ధి చెందారు. వీరికి మా శుభాశీస్సులు. ●

## జయము నీకు త్రివర్ణ పతాకా!

ఎగురుచున్నది, ఎత్తెగురుచున్నది
ఎంతో ఎత్తు ఎగురుచున్నది ॥ఎ॥
అవధుల్లేని ఆనందం పంచుతు
ఆకాశపు పరిధి వరకూ
ఎంతెంతో పులకింతలు అధరాలను పండిస్తూ ॥ఎ॥

మువ్వన్నెల మన జెండా
మధ్యన ధర్మచక్రము -
మన శాంతము మనసహనం
మన శౌర్యము, సౌందర్యము గురుతు చేస్తూ ॥ఎ॥

సత్యధర్మము సమభావము
విశ్వమంతా ఒక కుటుంబమని
విశ్వ సమైక్యతను చాటుచు
విశ్వజనుల శ్రేయఃకామిగ ॥ఎ॥

లేత నూలు పూవుల జడ వేసుకుని
పావురాయిలా ఎగురుతూ - పురి
విప్పిన నెమలిలా ఆడుతుంటే
రోజురోజుకూ పెరిగే నెలవంకలా
నింగిన వర్ధిల్లుతూ ధరను అమృతధారలు వెలయిస్తుండే జెండా!
జయము జయము
జయ 'హిందు' వందనము!

## నా రక్త ఘోష 'తెలుగు' అని వాగ్విభవుడు, వాచస్పతీ

# సి.నారాయణరెడ్డి!

| | |
|---|---|
| **పూర్తి పేరు:** | సింగిరెడ్డి నారాయణరెడ్డి |
| **పుట్టింది:** | 1931 జులై 29న (కరీంనగర్ జిల్లాలో సిరిసిల్ల తాలూకా) హనుమాజీపేట |
| **తల్లిదండ్రులు:** | బుచ్చమ్మ, మల్లారెడ్డి |
| **భార్య:** | సుశీల |
| **సంతానం:** | నలుగురు కుమార్తెలు గంగ,యమున, సరస్వతి, కృష్ణవేణి |
| **విద్యార్హతలు:** | ఎం.ఎ, పీహెచ్‌డి (ఉస్మానియా విశ్వవిద్యాలయం) |
| **తొలిసినిమా పాట:** | నన్ను దోచుకుందువటే (గులేబకావళి కథ -1962) |
| **ఇప్పటివరకు రాసిన సినిమా పాటలు:** | 3500కు పైగా 4000లకు లోపు |
| **మాటల రచయితగా:** | ఏకవీర, అక్బర్‌సలీం అనార్కలి |

సి.నా.రే అన్న మూడు అక్షరాల్లోనే సత్యమైన, సకలార్థ సాధకమైన, నారాయణాత్మకమైన, 'రామ' తత్వ సాహిత్యమును రంగరించి పోసి ఉన్నది; స్వచ్ఛమైన, సుందరమైన, సుమధురమైన అచ్చతెలుగు ఉన్నది.

'నన్ను దోచుకుందువటె వన్నెల దొరసానీ' అన్న సురుచిర రుచి పూర్వక పాటలోనే ఆయన తెలుగు భాషాస్వాదకుల మనసును దోచుకున్నారు. సి.నారాయణరెడ్డి అంటేనే 'తెలుగు సాహితీమతల్లి' మురిసిపోతుంది. 'సరిలేరు నీకెవ్వరూ సురపాల సుధాకరా! సురవైభవా! భాసుర, సుస్వర, సుమంజల, సుమధుర, సుమసుమాంతర మృదువత్వ కూర్పరీ! రమణీయమైన తెలుగు ఆనంద, ఆస్వాదనా మంజులత్వాన్ని మీ కలంతోనూ, గళంతోనూ పురివిప్పిన నెమలిలా ఒక చోట, పంజావిప్పిన పులిలా మరొక చోట 'కావ్యరచనల్లో' ప్రభావింపచేసిన కవితాసార్వభౌముడా. విశ్వంభర వ్రాసినా, 'పగలే వెన్నెల జగమే ఊయల' అనే రసమంజుల హృదయాన్ని రసిక సినీ అభిమానులకందించడంలోనూ, 'ఈ నల్లని రాళ్ళలో ఏ కన్నులు దాగెనో' అనే సినీ గీతంతో 'అమరశిల్పి జక్కన' ద్వారా రాయలవారి హృదయాన్నీ, రాయల సామ్రాజ్య శిల్ప కళా వైభవాన్ని స్ఫురణకు తెచ్చిన కవిరాయడా! కాలాలు వేరు కావచ్చు, కనకంలో తామ్రము (రాగి) ను కలిపి, ఓ చక్కని అభరణమును కూర్చే రంజిత రసికత్వం ఒక్క మధుర కవిలోనే ఉంటుంది. భూత, వర్తమాన, భవిష్యత్తుల్లోని ప్రవర్ధమాన కాలాన్ని పసిగట్టగల పసిడి కవిత్వం. ఎప్పుడో గతించిన నన్నయ్య, తిక్కన, పోతన, శ్రీనాధుడు, గురజాడ, చిలకమర్తి, పానుగంటి, విశ్వనాధ వంటి మహాకవులు, త్యాగరాజు, కృష్ణమయ, అన్నమయ, రామదాసు వంటి వాగ్గేయకారులు మదిలో ఇంకా ఒదిగి పొదిగా ఉన్నదంటే రసరంజిత, 'భారతి' అనుగ్రహమూర్తులు కావడమే!



ఆదినుంచీ భక్తితోనే మన సాహిత్యం ముడివడి ఉన్నది.

**'నా హమి వసామి వైకుంఠే**
**నయోగి హృదయే రవౌ**
**మద్ భక్తాః యత్రగాయన్తి**
**తత్ర తిష్ఠామి నారదా!'**

– అని ఆ వైకుంఠంలో గానీ, యోగి హృదయాల్లోనూ ఉండను, ఎక్కడ నా భక్తులు గానం చేస్తారో ఆ సాహిత్యంలో, వారి గళంలో అక్కడ ఉంటాను శ్రీమన్నారాయణుడన్నాడా. ఆ సంకీర్తనా సాహిత్యాచారుడీ సి.నారాయణుడు. అట్టి సభక్తియుత సరళ సాహిత్యం ఈ సరళ నారాయణుడు సి.నారాయణరెడ్డిలో సజీవంగా కనిపిస్తుంది. ఈ మృదు మధుర, మంజుల, మనోహర, భాసుర సురామాన కవిత్వ హృదయం కలం ద్వారా, గళం ద్వారా రసరంజితం చేస్తూన్నదన్నది అక్షర సత్యం. ఆయన జ్ఞానేశ్వరి, జ్ఞానపీఠ ఆస్థానాన్ని అలంకరించిన రెండవ తెలుగు కవి సార్వభౌముడు.

తెలుగు తల్లి గళానికి కట్టిన సాహితీ సువర్ణ రత్న ఖచితమణిహారం. వసివాడని మల్లెపూ గుభాళింపుల సుమహారం.

సి.నా.రే.ను కదిపితే కవిత్వం, కదలిస్తే కవిత్వం, స్పందిస్తే కవిత్వం, రంజిస్తే కవిత్వం. అది 'విశ్వంభర' కావచ్చు, సినిమా గీతం కావచ్చు. అది 'బాలర'సాల నవపల్లవ కోమల కావ్యకన్యే! మందారమకరంద మాధురీ స్వరమైన తెలుగు తల్లి స్వరమే!

ఆయనకు రాజకీయాలతో సంబంధం లేదు. రాజకీయ నాయకులతో సంబంధం ఉన్నా అది తామరాకుపై జాలువారే నీటి 'ముత్యం' ముత్యపు చిప్పలో కురిసిన స్వాతివాన చిరుచినుకు. ఏ ప్రాంత భావమూ ఆయనకుండదు, శశాంకుని చంద్రికలా అందరి పైనా కవితా సౌరభపు పరిమళం కురిపించడమే ఆయన ప్రత్యేక ప్రవీణత.

**కరకకుశ గ్రుచ్చుకొని**
**నోరు గాయమైన**
**పూయుచు గార నూనెను**
**పుండు మాన్పినట్లు–**

కరకుశల్లా ఆంగ్ల భాషాపదములతో భాషను ఆయన కలుషితమొనర్పరు. సుమధుర సుమంజుల తెలుగు భాషారాధనం చేస్తున్న తెలుగు కవి సి.నారాయణరెడ్డేనని చెప్పకతప్పదు. భాగ్యనగర (హైదరాబాద్)జంటనగరాల్లో ఆయన పాల్గొనని, భాషించని సభ ఉండదు. తెలుగు తల్లే ఆ సభ కోసం వేచి చూస్తుంటుంది.

**సి.నా.రే చెప్పని సంగతి లేదు. ఆయన వెలుగు గురించి చెబుతూ: "కరిమబ్బులు కమ్మేవేళ, మెరుపు తీగే వెలుగు మతితప్పిన కాకులరొదలో మౌనమే వెలుగు కారు చీకటి ముసిరేవేళ వేగుచుక్కే వెలుగు! దహించే బాధల మధ్య సహనమే వెలుగు" అంటారు.**

**మరోచోట: మబ్బులు వస్తూ పోతుంటాయి. నిలిచేదొకటే నీలాకాశం. కలతలూ వస్తూ పోతుంటాయి. మిగలే దొకటే వలచే హృదయం.**

– ఫిడేలు విద్వాంసుని వేళ్ళ తీగల మీదెలా స్వర సంగీత ఝురి కురిపిస్తుందో, సి.నా.రె వేళ్లలో నున్న కలం అలా లయబద్ధంగా నడుస్తుంది.

అలాగే జంటనగరాలను నాలుగు మాటల్లో రిక్షావాని పాత్రలో చెప్పించేశారు.

**అటు చూస్తే చార్‌మినార్, ఇటు చూస్తే జుమ్మామసీదు ఆ వంక అసెంబ్లీహాలు ఈ వంక జూబిలిహాలు తళతళ మెరిసే హుసేన్ సాగరు దాటితే సికిందరాబాదు–** ఇలా చెప్పాలంటే ఎన్నో, ఎన్నెన్నో! ఆయన పెదాల సరాల్లో పదాల స్వరాలుంటాయి. ఆయన పాటకు ఆయనే స్వరం కట్టగలరు. నేను నిర్మించిన సినిమాలో అనుభవ పూర్వకంగా నెరిగిన సత్యం. నాలుగు పాటల్నీ అవలీలగా వ్రాసియిచ్చారు. సలలిత సరళిత సమ్మోహిత సాహిత్యానికి ఆయనకు ఆయనే సాటి. నిండు నూట ఇరవై ఏండ్లూ ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలి అని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం. ●

### మధుర గాయకుని స్మృతి:

# ఘంటసాల వంటి గాయకుడు మరొకడు పుట్టడు!

వేలకొద్దీ సినిమా పాటలూ, వందలకొద్దీ లలిత సంగీత గీతాలూ, పద్యాలూ ఆలపించి, మహమద్ రఫీ వంటి మధుర గాయకులచే 'సెహబ్బాష్' అనిపించుకున్న మేటి గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు. ఆయన సర్వకల్పన చేసిన ప్రతీ చిత్రము సంగీత సరస్వతి మెడలోని మణిహారమే! ఎందరో గాయనీ గాయకులను ప్రోత్సహించి, పాటలు పాడించిన కీర్తి కూడా ఘంటసాలకే దక్కుతుంది. కరుణశ్రీ పద్యాలు 'పుష్ప'విలాపానికి శాశ్వతకీర్తిని తెచ్చినవాడు ఘంటసాల. చివరిగా 'భగవద్గీత' శ్లోకాలను పాడి, వ్యాఖ్యానం కూడా మనోహరంగా చెప్పి, చిరకాలమూ ఉండిపోయే శాశ్వతకీర్తిని సంపాదించుకున్న ఘంటసాల సంగీత సరస్వతి కంఠమణిహారమనే చెప్పాలి. ఆరోజుల్లో గాయకులకూ, సంగీత దర్శకులకూ పెద్ద పారితోషికములు లేవు. ఎన్టీ రామారావు, ఏ.నాగేశ్వరరావు, శోభన్‌బాబు, కాంతారావు వంటి ప్రజ్ఞాశీలురైన నటీ నటులకు తన సుస్వరమును ఎరువు యిచ్చి వారి పేరు ప్రఖ్యాతులకు కారణభూతుడైనవాడు ఘంటసాలే! 'దేవదాసు'లో ఏ.నాగేశ్వరరావుకు అంత కీర్తి రావడానికి ఘంటసాల స్వర ఝంజామారుతం ఒక ప్రధాన కారణమని చెప్పాలి. పాండురంగ మహత్యం, మల్లీశ్వరి వంటి ఎన్నో చిత్రాలలో ఎన్టీ రామారావు స్వర పేటికకు సరితూగేలా, వారే పాడుతున్నట్టు భ్రమింపచేసిన స్వర ఇంద్రజాలికుడు ఘంటసాల స్వర వేంకటేశ్వరరావు. ఘంటసాలకు మిమిక్రీ తెలియదు. ఏ మాయాజాలమూ తెలియదు. ఏఁవండీ మీరు అక్కినేని నాగేశ్వరరావు పాడినట్టూ, ఎన్టీ రామారావు పాడినట్టూ ఏలా పాడకలుగుతున్నారండీ! మీ కంఠసాలలోని విశేషమేమి అని అడిగితే – ఏఁవీ విశేషం లేదు. అక్కినేని నాగేశ్వరరావుగారికి ఒకటిన్నర సుతిలోనూ, ఎన్టీ రామారావు గారికి ఒక సుతిలోనూ పాడతాను – ఇలా వారి గళస్వరములకు తగినట్టు పాడుతున్నట్లు మీరు భ్రమించడం అటువారినీ, వారి అభిమానులనీ సంతోష పరచడం నా వృత్తిధర్మం అని నవ్వేసేవారు! ఎన్టీఆర్ గారికి పాడిన 'మల్లియలారా – మాలికలారా మౌనముగా ఉన్నారా? మా కథలే విన్నారా!' అనే పాట ఎన్టీఆర్ అభిమానులను సంతోషజగాలలో ఊపేసింది. అలాగే అక్కినేనిగారికి 'అందమె ఆనందం, ఆనందమె జీవిత మకరందం' అను పాట, 'పాడుతా, తియ్యగా – పసిపాపలా నిదురపో కమ్మగా' అలా అనేకవందల పాటలు సంగీత ప్రపంచంలో నిలిచిపోయేలా, ఆ ఇద్దరు అగ్రనటులకీ గొంతు అందించి, వారికీ తనకీ చిరస్థిర కీర్తినీ, అఖండాదరణ పొందినది ఘంటసాల యొక్క కంఠశాలే అనడంలో అతిశయోక్తి లేదు. భగవాన్ సత్యసాయి బాబావంటి వారిని అలరింపచేసిన స్వరం ఘంటసాల వారిది. దక్షిణోత్తర భారతాల్లోనే కాదు, సాగరాలు దాటి ఆయన కీర్తి విస్తరిల్లింది. 'లవకుశ' సినిమాలో ఆయన కూర్చిన స్వరాలు ఎన్ని ఏళ్లయినా స్మృతిపథంలో మొదల్నానే ఉంటాయ్. దక్షిణ భారతంలో ఆయన్ను మించిన చలనచిత్ర, లలిత సంగీత గాయకుడు లేడు, మరల పుట్టబోడు. ప్రపంచ ప్రఖ్యాతిగొన్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆయన్ను తొలి ఆస్థాన విద్వాంసునిగా నియమించి, ఆయన శిరమున కలికితురాయి పెట్టడం మనమంతా గర్వించదగిన విషయం. ఏడుకొండలవాడిపై ఆయన పాడిన పాటలు మధుర భక్తిరసగుళికలు. **ఏడుకొండల స్వామి ఎక్కడున్నావయ్యా ఎన్ని మెట్లెక్కినా కనపడావేమయ్యా, నమో వేంకటేశా, నమో తిరుమలేశా** ఇలాటి సంకీర్తనము లెన్నో తిరుమలలో తొలి మంచు తెరలు విడుతున్న ప్రాభాత సమయాన, చీకట్లకు వీడ్కోలు చెబుతూ దివాకరుడు కోటి కిరణభాసుడై, ఎర్రటి గుమ్మడి పండులా కుందనపు రంగులో వెలిగిపోతున్నవేళ ఘంటసాల పాడిన పాటలు తిరుమలను దర్శించే భక్తుల శ్రమదమాదులను మరిపింపజేయడమే గాకుండా, భక్తిప్రపూరిత మనస్కుల్ని చేస్తూ, మురిపింపచేస్తాయ్.




ఆయన పాడిన పరవశింపచేసిన పాటలన్నీ ఒక యెత్తు, జీవిత చివర ఘడియల్లో తానుగా స్వరపరిచి పాడిన భగవద్గీత ఒక యెత్తు. 'భగవద్గీత'తో తరించి అందరినీ తరింపచేశాడు!

వ్యాస మహాభారతం పునీత కావ్యం, పంచమవేదం అనడానికి, కురుక్షేత్ర సంగ్రామ కాలంతో 'కృష్ణార్జున సంవాదం'గా కూర్చిన భక్తిరస శాస్త్రం 'భగవద్గీత'యని చెప్పాలి. పండిత వాగ్గేయకారులు ఘంటసాల వేంకటేశ్వరరావు జీవిత చివరి క్షణాల్లో ఆలపించిన 'భగవద్గీత' ఉత్కృష్టమైనదన్నారు.

'పార్థా' కోట్లాదిమందిలో ఏ కొద్దిమందో నన్ను చూడగలరు. వారిలో ఏ కొద్దిమందో నన్ను గ్రహించగలరు. వారిలో ఏ ఒకరిద్దరు నన్ను చేరుకోగలరు. నేనే సత్యం నేనే సత్యం' నా జన్మలు, నేనెరుగుదును, నీ జన్మలు నీవెరుగవు' – అంటూ గద్యాన్ని కూడా హృద్యంగా 'భగవద్గీత'లోని శ్లోకమంత సుందరంగా వ్యాఖ్యానించిన ఖ్యాతి ఆయనకే దక్కింది.

ఆయన పుట్టిన తేదీ ఆంగ్ల సంవత్సరం 1922 సంవత్సరం చివరి నెల డిసెంబర్ 4వ తేదీ అయితే, ఆయన వర్ధంతి ఆంగ్ల సంవత్సరం 1974 సం॥ తొలి రెండవ నెల ఫిబ్రవరి 11 మొదటిది. సంగీత జీవనం సినిమా, రెండవ సంగీతం జీవనం భగవద్ధర్మసారమైన భగవద్గీత. ఈ 'భగవద్గీత'ను హెచ్.ఎం.వి. మంగపతి ధ్వని ముద్రితం చేయించి 35 సంవత్సరములు దాటినప్పటికినీ, పవిత్ర దేవాలయముల్లో, కోట్లాది భక్తుల మనంలో, శ్రవణంలో ఇప్పటికీనీ మెదులుతూ భక్తిడోలల్లో ఊగిస్తూనే ఉన్నది.



హెచ్.ఎం.వి. శబ్ద నిర్దేశిక కేంద్రంలో హెచ్.ఎం.వి. అధికారి మంగపతి ఘంటసాల వాద్య బృందంతో 'భగవద్గీత' ధ్వని ముద్రితం చేస్తూన్న సమయంలో...

'సత్యం'ను 'సుందరం'గా చెప్పాలంటే ఘంటసాల పరమపదించిన తరువాతనే ఆయన కీర్తి ఉదయమున సూర్యుడు, సాయం సంజె వేళల్లో చంద్రుడు ఉదయించినట్లు అనునిత్యము భక్తుల హృదయ పరితాపాన్ని తీరుస్తూనే ఉంది. మరికొన్ని శతాబ్దములైననూ జనముల మనముల్లో సంతోషభక్తి తరంగాల నుప్పతిల్ల చేస్తూనే ఉంటుంది. ఆయన తెలుగువాడై నందుకు మన మందరమూ గర్వపడాలి.

మీ మనములెలా ఉన్ననూ, ఘంటసాల సన్నిహితునిగా మెలిగిన మధుర క్షణాలను గుర్తుచేసుకుంటూ, నేను గర్వపడుతున్నాను. – గోటేటి

# తేట తెనుగుల 'మల్లెమాల' అనేక మధుర స్మృతులను వదిలి వెళ్లారు!



తేట తెనుగు పదాలను పెదాలపై పల్లవింపచేసే అచ్చంపు తెలుగు మనిషి, స్వచ్ఛమైన తెలుగు భాషా పంచెకట్టు. అమెరికాకు వెళ్లినా, ఏ దేశమెళ్ళినా అదే పంచెకట్టూ, అదే లాల్చీ, అదే కండువా. అదే తెలుగు భాష. కవులపై, రచయితలపై, పత్రికా రచయితలపై, తెలుగు సభలపై పదహారణాల తెలుగుపై 'మల్లెమాల సుందరరామిరెడ్డికున్న అవ్యాజవాత్సల్యం, అమేయమైన పట్టూ, మరే ఇతర తెలుగువానికీ లేదనే చెప్పాలి. ఆజానుబాహుడూ, ఆరడుగుల యీ తెలుగువాడు తెలుగేతరనాడుల్లో ప్రసిద్ధిగన్నాడు. ఖచ్చితమైన మనిషీ, గంభీరమైన స్వరమూ! బెట్టుగా కనపడతాడు గానీ, ప్రేమను అతిగుట్టుగా దాచుకుంటాడు. ఆత్మగౌరవానికి భంగం రానీయడు.

ఆయన మద్రాసు వచ్చి, మొదటిగా 'కొంటెపిల్ల' అనువాద చిత్రాన్ని చేస్తున్నప్పుడు చూశాను. ఈయన సినిమా రంగంలో నెగ్గుకుని రాగలడా అని సందేహపడ్డాను. ఎవరికీ సాధ్యం కాని ఎన్నో పెద్ద తారాగణపు చిత్రాల్ను తీశాడు. ఎవరి స్ఫురణకూ కలగని మేధాశీలంతో 'సంపూర్ణ రామాయణం' గాధను పిల్లలతో చిత్రంగా నిర్మించి తన 'పస'ను చూపాడు. పత్రికా రచయితలకు తన చిత్రాన్ని 'ప్రీవ్యూ'గా చూపడంనుంచీ కొత్తదనమే! ఒక చిత్రానికి ఓ సాయంత్రము వాహనంలో పత్రికా రచయితల్ని తోడ్కొని, మార్గమధ్యంలోనే రహదారి ప్రక్కనగల పచ్చని చేల గాలి వీస్తుండగా, అందర్నీ ఉపవిష్టుల్ని చేసి ఉపాహారాలను పంచి, రాత్రికి తిరుపతి కొండపై బస చేయించి, వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా దర్శనం చేయించి, ఆ రాత్రి అక్కడి హోటల్‌లో ప్రత్యేకంగా విందు భోజనం చేయించి, చక్కటి వసతిని కల్పించి, ఉదయం ఫలహారములైన తరువాత వాహనముల్లో 'తడ' తీసుకుని వెళ్లి, అక్కడి థియేటర్‌లో 'కోడెనాగు' చిత్రాన్ని ప్రదర్శించిన తరువాత అక్కడనే మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసి, అతిభద్రంగా ఇళ్లకు చేర్చిన సందర్భం ఇంకా నా మదిలో 'మెరుము'లా మెరుస్తూనే వుంది.

తన యింట్లో వివాహానికి తనతో పరిచయం ఉన్న కవులను పిలిపించి, వారి కవితలను 'పుస్తకం'గా ముద్రించడమే గాకుండా, ఓ కవితాగోష్టి ఏర్పరచి, వారం దర్నీ సత్కరించిన అపర భోజుడు ఎవరయా అంటే మల్లెమాల సుందరరామరెడ్డి. సినిమా రంగంలో రెడ్డి ప్రభువుగా, సహజకవి, పండితునిగా మెలిగిన ఏకైక వ్యక్తి.

'కళాసాగర్' సంస్థ అధ్యక్షునిగా, తెలుగు చలనచిత్ర నిర్మాతల సంఘం అధ్యక్షునిగా, ప్రపంచ తెలుగు సమాఖ్య పాట్రన్ సభ్యునిగా కార్యవర్గ సభ్యుల సమావేశాలన్నిటిలోను హైదరాబాదు నుంచి వచ్చి పాల్గొనడమే గాక, దేశ విదేశాల్లో జరిపిన అన్ని ప్రపంచ తెలుగు మహాసభలకూ వచ్చి, కవితా గోష్టులకు అధ్యక్షత వహించి, తన సాహితీ గరిమను చూపిన తెలుగు భాషా అభిమాని. అనేక భిన్న స్వభావాలు గల సినిమా తారలూ సాంకేతికుల మధ్య, తనదైన బాణీలో మసలుతూ, తనకంటూ ఒక ప్రత్యేక గౌరవాన్ని, ఉన్నత స్థానాన్నీ, పరిశ్రమలో సాహితీ ప్రపంచంలో కల్పించుకున్న ప్రత్యేక తరహా వ్యక్తి. సహజకవే కాదు, చక్కని వక్త. ఆయన చిత్రాలు ఎన్నో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ అవార్డులందుకున్నాయ్. ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డునందుకున్నారు. ఎన్నో పదవులు, ఎన్నెన్నో సత్కారములందుకున్నారు. ఎందరో నిలబడడానికి సహాయాన్ని చేశారు. మూడువేలమంది బాలలతో 'రామాయణం' చిత్రం తీయడమొక సాహసమైతే, ఎన్టీరామారావు, ఎస్వీ రంగారావు, నాగభూషణం, జయలలిత (ఇప్పటి తమిళనాడు ముఖ్యమంత్రిణి), జమున, హేమమాలిని వంటి మేటి తారలతో పౌరాణిక చిత్రం నిర్మించడం మరో సాహసం.

'మల్లెమాల'గా ప్రఖ్యాతినొందిన శ్రీరెడ్డి గారికి పద్యరచన కరతలామలకం. వీరు 'రామాయణం'ను పద్యాలతో వ్రాసారు, వీరిటీవల స్వీయ చరిత్రను ఉన్నదున్నట్టుగా వ్రాసి విమర్శలకు గురి అయ్యారు. అయినా చలించలేదు, వగవలేదు. 1924 ఆగష్టు 15 నెల్లూరు ప్రక్క అలిమిలి గ్రామంలో జన్మించారు. వీరి కుమారుడు శ్యామ్‌ప్రసాద్ రెడ్డి విజయవంతమైన చిత్రాలను తీస్తున్నారు. మల్లెమాల దగ్గరున్న గొప్పతనం కవులను ముఖ్యంగా శ్రీ మాలకొండారెడ్డిగారిని కానీ, తన అభిమాన చలనచిత్ర పంపిణీదారుడూ, సాహితీపరుడూ, సేవాభావం కల జగపతీ వేంకటేశ్వరరావును గానీ తోడుగా తీసుకుని వెళ్ళేవారు. వీరిరువురికీ పరస్పర వాత్సల్యమున్నది. శ్రీ రెడ్డిగారి మరణం, సినిమా సాహితీ రంగాలకు తీరని లోటు. ప్రముఖాంధ్ర వారికెంతో ఇష్టం. వారి మరణానికి 'ప్రముఖాంధ్ర' ఎంతో విచారిస్తున్నది. ●

## మానవ జీవితం సుఖైశ్వర్యాలతో ముడివడింది!

**మా సంస్కృతీ, సాంప్రదాయములు ప్రముఖాంధ్ర జతపడింది!!**

**మీ (మా) ప్రపంచ మా(న)స పత్రిక**

# 'ప్రముఖాంధ్ర'

**మీ, మీ సభ్యత్వాలు, పోషక చందాలపై పత్రికా బలం ముడిపడి ఉంది. పదిహేడు సంవత్సరాలుగా 204 మాసాలూ 204 సంచికలూ వెలువడి ఈ సంచిక 205 సంచికగా వెలువడుతూ పద్దెనిమిదవ సంవత్సరంలో ప్రవేశించినదంటే కొంతమంది పాఠక సార్వభౌములే కారణం! ఆ సౌజన్య హృదయులందరికీ కృతజ్ఞతా వందనములు. శేషించిన పాఠక మహాశయులు కూడా తమ తమ ప్రోత్సాహక సభ్యత్వాలను పంపించగలరని విశ్వసిస్తున్నాం. ప్రపంచమంతా 'ప్రముఖాంధ్ర' విభ్రాజిల్లాలి! ప్రపంచంలోని 'ప్రముఖాంధ్రు' లందరూ సుఖైశ్వర్యాలతో వర్ధిల్లాలి!**

**2012 నూతన సంవత్సర సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు!**

*Compliments from*

**Sri Krishna Bhat**

When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala

**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.

**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504

**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# వందేమాతరం
## (ఓ మాతృదేవీ! నీకు వందనం)



**సు**జలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలం మాతరమ్‌చ వందేమాతరమ్

(**నువ్వు సుజలవు** – పవిత్ర నదీజలములనిస్తున్నావ్. **సుఫలవు** – మంచి ఫలములనిస్తున్నావ్. **మలయజ శీతలాం** – చల్లని పర్వతగాలుల నిస్తున్నావ్. **సస్యశ్యామలం మాతరమ్** నీవు పంటలను పండించి యిచ్చే మంచి తల్లివి)

**శుభ్రజ్యోత్స్నా పులకితయామినీమ్ పుల్ల కుసుమిత ద్రుమదల శోభినీం,**
**సుహాసినీం సుమధుర భాషిణీం సుఖదాం వరదాం మాతరమ్.**

(ఓ తల్లీ, నీ వెన్నెల రాత్రులు పులకిత కాంతిమయాలు, పుష్పించిన వృక్షోభితాలు మృదు మధుర మంజుల మందస్మిత మధుర వాగ్భూషణములు, సుఖ సౌభాగ్యములనిచ్చేవి తల్లీ)

**కోటి కోటి కంఠ కలకల నినాదకరాలే**
**కోటి కోటి భుజైర్ధృత ఖరకరవాలే అబలాకేనో**
**మాఏతోబలే బహు బల ధారిణీం నమామి**
**తారిణీం రిపుదల వారిణీం మాతరమ్**

(కోట్ల కోట్లాది నీ పుత్రులు యుద్ధనాథ విరాజితులు (శాంతిప్రియులు) కోటానుకోట్ల చేతులు ఎత్తిన కరవాలముల పదును నీ వర్చస్సు, నీవు బహుబలవమ్మా. అమిత శక్తిశాలినివైన మా రక్షకివి నీవే తల్లీ! నీకిదే వందనం. శత్రు సేనలను తరిమికొట్టే శక్తిగల తల్లివి నీవే! ఓ తల్లీ నీవు జ్ఞానప్రదాయివి.)

**తుమి విద్యా తుమి ధర్మా తుమి హృది తుమి**
**మర్మత్వం హిః ప్రాణాః శరీరే, బహుతే తుమి మాఃశక్తి**
**హృదయేతుమి మాఃభక్తి తోమారయి ప్రతిమాగడి మందిరే మందిరే**

(ధర్మనేత్రివి అమ్మా! మా సహృదయానివీ నువ్వే, మా ఆత్మవి నువ్వే! మా జీవన సర్వస్వానివి. మా భుజబలశాలినివి. నీ హృదయం ప్రేమ విశ్వాసాల అమృత కలశము. నీ యీ దివ్యరూపాన్నే మా హృదయమందిరంలో, ప్రతీ దైవ మందిరంలో ప్రతిష్టిస్తాం.)

**త్వం హి దుర్గా దశ ప్రహరణధారిణీ, కమలా కమలదళ విహారిణీ**
**వాణీ విద్యాదాయినీ నమామిత్వాం నమామి కమలాం**
**అమలాం అతులాం సుజలాం సుఫలాం మాతరమ్ ॥ వం**

(దశాయుధాలు ధరించిన దుర్గవు, కమల దళ అధిష్టితవయిన లక్ష్మివి. నువ్వే! సకల కళారూపిణియైన సరస్వతీవీ నువ్వే! తల్లి నీకిదే వందనము. సకల విద్యాప్రదాయినివి. సకల సంపద్దాతవు నువ్వేనమ్మా' నువ్వు కమలవు, అమలవు, అతులవు, సుజలవు, సుఫలవు – నీకిదే వందనం తల్లీ!)

**శ్యామలాం, సరళాం, సుస్మితాం భూషితాం**
**ధరణీం, భరణీం మాతరమ్! వం॥**

(శ్యామలవర్ణవు, సుస్మిత భూషిణివు. ఆభరణ భూషితవు, సమృద్ధ సంపద్దాతవునైన నీకిదే వందనమమ్మా)

ప్రతీ భారతీయుడూ కుల మత జాతి ప్రాంత భేదాలను ప్రక్కనపెట్టి, ఈ దేశ గాలి, నీరు, ఆహారం, ఆహార్యం అనుభవిస్తున్న వారంతా భక్తిపాత్రులై, పర్వదినాల్లో, ప్రాతః సంజా సమయములందు ప్రార్థించవలెనని దేశభక్తునిగా నా ప్రార్థన! ●

## ఈ జెండా జాతీయ జెండా!
## ఈ జెండా ఎజెండాగా పాలన జరగాలి!



**ఈ** జెండాను భక్తిప్రపత్తులతో మోస్తూ, పరవశంతో పరుగెడుతూన్న పాపను గాంచి జెండా కూడా నెమలి కన్నులా విప్పారి ఎగురుతూంది! ఆ త్రివర్ణ పతాక మూలపురుషుడు తెలుగువాడు పింగళి వెంకయ్య అనీ, ఆ జెండా మధ్యలో నున్న చక్రము ధర్మచక్రమనీ, ఆ ధర్మచక్రంలోని రేకుల వలె అశోకుడను చక్రవర్తి దేశాన్ని చతుర్ధర్మాలతో పాలించినాడని ఆ బాలికకు తెలుసా? సనాతన ధర్మభూయిష్టమైన పుణ్యభూమి 'భారత్' యనీ, అదే హిందువుల ధర్మ సిద్ధాంతమనీ ఎందరెరుగుదురు? 'హిందూ' పదమంటేనే గిట్టని ఇప్పటి నాయకులు 'లౌకికం' అంటూనే, దానికి మూలధర్మమైన, హైందవ సనాతన ధర్మం పీకలుత్తరిస్తున్నారే! **'జెండా ఊంఛారహే హమారా'** అనే మూలార్థాన్ని ఇప్పటి బాలురకు చెబుతూ, ఆ త్యాగమూర్తుల చరిత్రను ఎరుకపరచండి. భావితరాలవారైనా ఆదర్శ ధర్మమూర్తులౌతారు. ప్రస్తుత సమాజం సంఘటితంగా సత్యధర్మాలను పాటిస్తే తప్ప వీళ్లలాగే దేశభక్తి లేనివారుగా ఉంటారు. ఈ దోపిడీ ఇలాగే సాగుతుంది. సభ్యత పాటించనివారూ, సంస్కారహీన సంభా(వా)ధితులైన వారు మన నెత్తికెక్కిన కుంపట్లు. దోపిడీతనాన్ని నిరోధించాలంటే వీరిని నిర్జించాలి. జై భారతజననీ! జై వేదమాతా!



అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు, మాడపాటి హనుమంతరావు, దుర్గాబాయి దేశముఖ్, కొండా వెంకటప్పయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరి కృష్ణారావు



దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర, మల్లాది రామకృష్ణశాస్త్రి, అడవి బాపిరాజు, మధురాంతకం రాజారాం, కొడవటిగంటి కుటుంబరావు, అయ్యంకి వెంకటరమణయ్య, కాళోజి నారాయణరావు, దాశరథి? రామారావు, గోరా

# వీరందరూ తెలుగు జాతిరత్నాలు!



పింగళి వెంకయ్య



పుచ్చలపల్లి సుందరయ్య



వావిలాల గోపాలకృష్ణయ్య

దేశభాషలందు తెలుగు లెస్సయనే 'పదాన్ని' వెలుగు చూపిస్తూ వచ్చారు. వీరొక్కరు వారి రంగాల్లో నిష్ణాతులు, నిస్వార్థపరులు, సేవాదురంధరులు, త్యాగమూర్తులు, సాహిత్యమూర్తులు.

దేశం ఏఁవి యిచ్చిందని కాదు; దేశానికి మనం ఏఁవిచ్చి ఋణం తీరుద్దాం అని ఆలోచించారు. రత్నగర్భ వంటి భారతదేశంలో రత్నాలే పండాయ్.

నోరున్న వారందరికీ నీరిచ్చే నదులు, సంవత్సరానికి 3 పంటలు పండే పొలాలు, ఫలాల్ని యిచ్చే ఫలవృక్షాలు, ప్రకృతిని పరవశింపచేసే పచ్చదనం, అందాల పరువాన్ని రంగురంగుల్లో పుష్పించే పుష్పాలు, ఇచ్చేదే మనకు దక్కేది అనే దానశీలురు పుట్టి మెట్టిన ప్రదేశం ఈ ఆంధ్రప్రదేశం. అన్నపూర్ణ, కల్పవృక్షం కామధేనువంటివన్నీ ఈ దేశ సౌభాగ్యాలే! మన పెద్దలు చేసుకున్న పుణ్య కారణాన మనకు దక్కాయ్. బొక్కేవారు బయల్దేరకుండా చూడండి. గుడి లింగాన్నీ మ్రింగగల సమర్థులున్నారు. జాగ్రత్త! ●



దువ్వూరి సుబ్బమ్మ



బెజవాడ గోపాలరెడ్డి



భానుమతి



గుంటూరు శేషేంద్రశర్మ



ఉన్నవ లక్ష్మీబాయమ్మ



విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, రాయప్రోలు సుబ్బారావు, బుచ్చిబాబు, [illegible], శ్రీశ్రీ, చలం, గురజాడ అప్పారావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావు, గుర్రం జాషువా

## ఆంధ్ర సారస్వతాన్ని భావితరాల కందచేసిన సాహితీవతంసులు

ఏ ప్రఫుల్ల పుష్పంబునఁనీశ్వరునికి పూజ సల్పితినో ఇందు పుట్టినాడ. కలదేని పునర్జన్మ కలుగును గాక, మధుర మధురంబయిన తెలుగు భాష **రాయప్రోలు సుబ్బారావు**

ఆంధ్రపురాణమని ఆంధ్ర, సతతమూ తలిచే మధునా పంతులువారు– విశ్వనాథ జాషువా, దేవులపల్లి వంటి కవిచక్రవర్తులు ఉన్నవ లక్ష్మీ నారాయణ, బాపిరాజు, బుచ్చిబాబు, కలం మహనీయులవలెందర్నో మనం గుర్తుచేసుకుందాం.

## మాకొక జెండానిచ్చి ఉన్నతి కూర్చిన గాంధీపితా, పింగళి తాతా!

**మన్నికగన్న నరజాతులలో**<br>
**ఎన్నిక కలదోయ్ మన జాతియునని**<br>
**మాకొక దేశం మాకొక జెండా**<br>
**మాకొక ఉన్నతినిచ్చిన నేతా!**<br>
**నీకిదే జ్యోతా – ఓ స్వతంత్ర భారత పితా!**

(ఈ జెండా రూపకల్పన నామోదింపచేసిన జాతిపిత గాంధీ మహాత్మా పింగళి వెంకయ్య తాతా నీకూ మా జేజేలు!)

టంగుటూరి సూర్యకుమారి 1940–50 దశకంలో పాడిన పాట మా చెవులలో రిం రింమని మ్రోగుతుంది. మనసును పరవశింప చేస్తున్నది.

**పన్నెండు ధాన్యాలు వానదేవుడా - పంటమీద పండాల వానదేవుడా!**<br>
**పేదసాదా బతకాల వానదేవుడా - కూలినాలీ దొరకాలి వానదేవుడా!**<br>
**పారిపోయిన బావ వానదేవుడా - పరిగెడుతు రావాలి వానదేవుడా!**<br>
**ఊరికెళ్లిన బావ వానదేవుడా - ఉరికురికి రావాలి వానదేవుడా!**<br>
**తల్లిలేని బాలకులు వానదేవుడా - తల్లాటపడరాదు వానదేవుడా!**<br>
**పసిబిడ్డ బాలకులు వానదేవుడా - తల్లాటపడరాదు వానదేవుడా!**<br>
**చేటంత మబ్బు పట్టి వానదేవుడా - చెరువంత నిండాలి వానదేవుడా!**<br>
**మూడురోజుల వాన వానదేవుడా - ముప్పై రోజులు ముసురు రావాలి వానదేవుడా!**



New Jersey General Assembly
UPENDRA J. CHIVUKULA

| COMMITTEES | | COMMISSIONS |
|---|---|---|
| Telecommunications and Utilities, *Chairman* | 888 Easton Avenue Suite 3 | NJ Science & Technology |
| Appropriations | Somerset, New Jersey 08873 | Asian-American Foundation |
| | P: 732-247-3999 F: 732-247-4383 | |
| | asmchivukula@njleg.org | |

November 11, 2011

శ్రీ గోటేటి రామారావు గారికి,

ప్రముఖాంధ్ర యొక్క 18 వ వర్ష హర్ష సంచిక కోసం...

ప్రపంచ వ్యాప్తంగా తెలుగు జాతి కోసం ప్రముఖాంధ్ర అందిస్తున్న సేవలకు నా హృదయపూర్వక శుభాభివందనములు. భారతదేశం లోనే కాకుండా అమెరికా, బ్రిటన్, కెనడా, జర్మనీ , ఆస్ట్రేలియా, మారిషస్, దక్షిణఆఫ్రికా, యు.ఏ.ఈ, కువైట్, సింగపూర్, మలేషియా దేశాలలోని తెలుగు జాతికి, పత్రికా పరంగా మీరు అందిస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయం. మీరు ప్రవాసాంధ్రుల సమాచారంతో పాటు.. ప్రపంచలోని తెలుగు ప్రముఖుల గురించి అందించే వ్యాసాలు చూసి ఓ తెలుగువాడిగా ఎంతో గర్వపడుతున్నాను. తెలుగుజాతి కోసం మీకు నేను ఏదైనా సాయం చేయాల్సి వస్తే... అది గొప్ప సదవకాశంగానే భావిస్తాను. మన తెలుగు వెలుగులు మన భావి తరాలకు ఎప్పుడు అందాలని కోరుకునే వ్యక్తిని నేను. దీని కోసం చేసే ప్రతి కార్యంలో నేను సదా సిద్ధంగా ఉంటాను. అమెరికాలో తెలుగు భాషను, సంప్రదాయాలను పెంపొందించేందుకు నావంతు సాయం ఏది కావాలన్నా.. మీరు నన్ను సంప్రదించవచ్చు. నా ఫోన్ నెంబర్ 732-247-3999.

మీ భవదీయులు,

ఉపేంద్ర చివుకుల

17th Legislative District
Franklin Township, Highland Park, Milltown, New Brunswick, North Brunswick, Piscataway

# ఆరు పర్యాయములు న్యూజెర్సీ అసెంబ్లీమాన్‌గా ఎన్నికైన ఉపేంద్ర చివుకుల

## - ఎవ్వరినీ నొప్పించని ఆర్ష ధర్మ గరిష్ఠుడు -

ఆయన ఆరడుగుల మనిషీ కాదు, ఆగర్భ శ్రీమంతుడసలే కాదు. అమెరికాలో ఉంటూ, ఆర్ష ధర్మమును పాటిస్తూ అక్కడి పౌరసత్వం పొంది, అన్ని వర్గాల వారి అభిమానాన్ని సంపాదించి, అధికార డెమొక్రటిక్ పార్టీలో మంచి స్థానం సంపాదించిన సర్వజన శ్రేయః కామి ఉపేంద్ర చివుకుల.



ఇటీవలే ఆయన భారతీయ వైదిక ధర్మానుసారంగా షష్టాబ్దుత్సవాన్ని చేసుకుని బంధుమిత్రులతో బాటు అందరి ఆశీస్సులనూ అందుకొన్న ఓ మంచి వ్యక్తి. డిప్యూటీ మేయర్‌గా, మేయర్‌గా, అసెంబ్లీమాన్‌గా, న్యూజెర్సీ శాసనసభ డెప్యూటీ స్పీకర్‌గా అంచెలంచెలుగా ఎదిగినవాడు. ఒకే శాసనసభా నియోజిక వర్గంలో ఆరు పర్యాయములు వరుసగా అసెంబ్లీ స్థానానికి ఎన్నికయినవాడు. ప్రతిపక్షం రిపబ్లికన్ పార్టీ వారి అభిమానాన్ని సంపాదించిన కీర్తి ఆయనకే దక్కింది.

విశ్వయోగి విశ్వంజీకి అంకితభక్తుడు, 'ప్రముఖాంధ్ర' పత్రిక పట్ల ప్రత్యేకాభిమానం కలవాడు. 2012 జనవరి సంచికను ప్రదానం చేసినవాడు. అమరజీవి పొట్టి శ్రీరాములు (నెల్లూరు జిల్లా) జిల్లాకు చెందిన మణిపూస. ఉత్తరోత్తరా ఎన్నెన్నో ఉత్తమ పదవులను అధిష్టించ కలుగుతాడనేదే మా విశ్వాసం. ఎదిగిన కొద్దీ ఒదిగే స్వభావం కలవాడు కాబట్టి అనూహ్యంగా ఎదగగలడని మా విశ్వాసం.

ఆచంద్రతారార్కమూ ఆయురారోగ్య ఐశ్వర్యములతో ఉపేంద్ర, ఉపేంద్ర కుటుంబ సభ్యులూ, ఉపేంద్రకు ఓటు వేసి విజయం చేకూర్చే పౌరులూ, వర్ధిల్లాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం.



# ఉపేంద్ర చివుకుల

**మించెతనకీర్తి చేత వాసించె దిశలు**
**తరమె తెలుపంగ తెలుగు నెవరికైన**
**ఆరుమారుల అసెంబ్లీమాన్ నయ్యెనతడు**
**ఆర్ష ధర్మ మరువని ఉపేంద్ర చివుకుల.**

రాజకీయాలంటే మోకాలలోతు దుఃఖం పీకల దాకా వచ్చేవరకూ సుఖము – అని అందరూ అంటారు. శాన్తిని మరిచి అశాన్తి నెవరు రేకెత్తిస్తూ ఉంటారో వారే రాజకీయ నాయకులుగా రాణిస్తూన్న రోజుల్లో నెల్లూరు జిల్లా నుంచీ చెన్నయ్ వచ్చి, చెన్నయ్ నుంచీ ముంబై వెళ్లి – అలా అలా అమెరికా చేరుకుని తన మంచి తనంతో న్యూజెర్సీలోని సోమర్‌సెట్ శాసనసభా స్థానానికి అసెంబ్లీమాన్‌గా ఎన్నికైనవాడు ఉపేంద్ర చివుకుల.

సత్యశీలుడూ, సదామంజుల భాషణలనే మాట్లాడేవాడే. జనావళి సుఖ సంతోషాలకు పాటుపడే ఉపేంద్ర వంటి మానవునికి అన్నీ సుసాధ్యములే!

దివిజ నుండి గంగను భువికి తెచ్చిన భగీరథుడు మానవుడు! సుస్థిర తారయైన 'ధృవుడు మానవుడు. బక్కచిక్కిన శరీరంతో కొల్లాయిగట్టి జాతిపితగా ప్రపంచవ్యాప్తపు పేరు సంపాదించిన మహాత్మా గాంధీ మానవుడు.

మంచి శీలము కలిగి సకల మంచినీ కోరితే మానవుడు దేవేంద్ర సింహాసనం అధిష్టించ గలడూ, ఉపేంద్ర చివుకుల తెలుగు మానవుడు కావడం గర్వ కారణం. ●

# మానవత్వపు మనిషి



మాననీయ మనిషి
నిలువెత్తు నెయ్యంపు మనిషి!
ఎందరినో ఎన్నదగిన మనిషి
చారుగుణశీలి - చామంతి మొగ్గ
చెల్లికి ప్రేమ పంచు గోరుముద్ద!
రక్తం పంచుకున్న రక్తసంబంధీకునిగా
ఆప్యాయతను పంచు ఆత్మబంధువు!!
ఆరు పర్యాయములు అమెరికా దేశమున
అసెంబ్లీమాన్‌గా ఎన్నికైన అసమాన ఘనుండు!!
అందరికి ఆత్మభవుండు - 'ప్రముఖాంధ్ర'కు
పేర్మి కూర్చు పెద్ద పోషకుండు - అతడే
న్యూజెర్సీ సచివాలయ సభ్యుండు
చివుకుల వంశకశ్రేష్టుడుపేంద్రుండు!!
చిరకాల సుఖశాన్తి సౌభాగ్యములందగలడు
ప్రముఖాంధ్ర పద్దెనిమిదవ హర్ష సంచిక ప్రదానుండు
**ఉపేంద్ర చివుకుల**



# జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

అత్యున్నతమైన దాన్ని మాత్రమే ఎల్లప్పుడూ కోరండి. దానిలోనే శాశ్వతానందం దాగి వుంది. ఆదర్శం నుండి అంగుళమైనా చలించకుండా జాగ్రత్తపడండి.

\- స్వామి వివేకానంద



నాతో ఒక మిత్రుడు రాజమండ్రి నుంచి ఫోన్ చేస్తూ రష్యాలో భగవద్గీతను అవమానకరంగా మాట్లాడుతూ నిషిద్ధం చేశారు. నీ జీవిరావ్ పేజీలో దానిగురించి ప్రస్తావించు అంటూ సలహా ఇచ్చాడు. రష్యా వేరే దేశం కాని మన దేశంలో వైష్ణవ కుటుంబంలో రామానుజం అనే నామధేయం కలిగిన ఒక ప్రబుద్ధుడు శ్రీరామచంద్రుని చరిత్రను కళంకపరుస్తూ రాముడికి సీత చెల్లెలు అని పిచ్చి కూతలు, వెర్రిరాతలు వ్రాస్తే, దానిని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఈ అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చారు. వివేకం, విచక్షణా లేని నాయకులు, ప్రభుత్వం దీనిపై స్పందించకుండా నోర్మూసుకుని వుంది. దీనిపై కలతచెందిన కొంతమంది విద్యార్థులు విశ్వవిద్యాలయానికి తెలియపరిస్తే వారు ఒక కమిటీని వేశారు. ఆ కమిటీ లోని మూర్ఖులు, ప్రబుద్ధులు, ఆ రామానుజం గాలి వార్తను, కారుకూతను సమర్థిస్తూ, సీతారాములు అన్నాచెల్లెళ్లు అని తీర్మానించింది. విద్యార్థులలో తీవ్ర అలజడి నెలకొని వారు ఉద్యమాన్ని ఉధృతం చేయగా, ఆ చర్యను ఖండించవలసినది పోయి ఆ రామాయణ పాఠ్యాంశాన్ని తొలగించారు. ఎక్కడో రష్యాలో జరిగిన దానిపై ఆవేశపడడంకన్నా సాక్షాత్ మన భారతదేశంలో వేదభూమి అయిన ఈ భారత పుణ్యభూమిలో అందునా భారతదేశానికి రాజధాని అయిన ఢిల్లీలో సాక్షాత్ 543 మంది ఎం.పి.లు వుండేచోట ఇలా జరిగినందుకు సిగ్గుతో తలదించుకోవాలి. భారతీయుల అణువు అణువులోను జీర్ణించుకున్న రామాయణ, భగవద్గీతలకు మన పాలకులు ఇచ్చే గౌరవం చూస్తూంటే నిజంగా మనం భారతదేశంలోనే వున్నామా అనిపిస్తోంది. ఇక్కడ మీకు రామనామ మహిమను తెలిసే కథ ఒకటి చెపుతాను. అది 1669 సంవత్సరం. ఢిల్లీ సుల్తాన్ వేసిన ఒక ఆజ్ఞకు భారతీయులందరూ కలత చెందారు. హిందువుల విద్యాసంస్థలను, వారి సాంప్రదాయాలను నాశనం చెయ్యమని సుల్తాన్‌గారి ఆజ్ఞ. అప్పటికే కాశీ విశ్వనాథుని గుడి ధ్వంసం చేసారు. అటువంటి క్లిష్ట సమయంలో హిందువుల పాలిట ఆరాధ్య దైవమైన వీరశివాజీ పౌరుషంతో, వీరంతో ఆ ఆజ్ఞకు తిరగబడి ఎదిరించాడు. ఆ వీరుణ్ణి ప్రాణంతోను లేక ప్రాణం తీసైనా జయించమని బీజాపూర్ సుల్తాన్ ఆజ్ఞాపించాడు. భటులు శివాజీని గాలిస్తున్న సమయం. (The History and culture of the Indian People "The Moghul Empire Chapter 10) అది పండరీపురం పాండురంగ విఠలుడి ఆలయం. అక్కడ భక్తతుకారాం మహరాజు నామసంకీర్తనం చేస్తున్నాడు. ఆయన భక్తిపారవశ్యంతో పాడుతుంటే భక్తులు ఆనందపారవశ్యంతో వింటూ వున్నారు. వారి మధ్యలో శివాజీ కూడా కూర్చుని భక్తి పారవశ్యంతో మునిగిపోయాడు. ఎలాగో ఈ విషయాన్ని తెలుసుకున్న భటులు ఆ ఆలయాన్ని సమీపించారు. కొంతమంది భక్తులు ఆ విషయాన్ని తుకారాం గారికి తెలియపరిచారు. హిందువుల ఆశాజ్యోతి అయిన శివాజీని ఎలాగైనా కాపాడాలి. తుకారాంగారు అంతవరకూ గానం చేసిన పాండురంగ నామజపాన్ని, రామనామజపంగా మార్చి గానం చెయ్యడం ప్రారంభించారు. ఆ రామనామ గాన మహిమవల్ల సుల్తాన్ గారి భటులందరికి అక్కడ వున్న జనులందరూ కొన్ని వందలమంది శివాజీలుగా కనిపించారు. అందులో నిజమైన శివాజీ ఎవరో నిర్ధారించుకోలేక వారు నిశ్చేష్టులై నోటమాటరాక అచేతనంగా నిలబడిపోయారు. అంతలో శివాజీ విషయాన్ని తెలుసుకొని ఆలయం వెనుక వైపుగా తప్పించుకున్నాడు. అంతటి మహిమాన్వితమైనది రామనామం. ఆ ఆరాధ్యదైవం లీలలు ఎన్నెన్నో. ఆరోజు శివాజీని కాపాడిన ఆ రామనామమే ఈనాడు నిరాశకు లోనైన హిందువులను పునరుత్తేజులను చేస్తుందని. మళ్ళీ మనలో తుకారాంలు, శివాజీలు పుడతారనే నమ్మకం నాకుంది. మీరు నమ్మండి.

* * *

## తేజః స్ఫూర్తినిచ్చిన 'తేజస్' దశవర్షోత్సవం



శతాబ్దంన్నర వైభవాలకు కారణమైన చరిత్ర కలవారు చెన్నపట్టణంలోని తెలుగు పత్రికలూ, తెలుగు పత్రికా రచయితలూ! చెన్నపట్నమే పత్రికా కాణాచి.

'తేజస్' అనిన తెలుగు జర్నలిస్టుల అసోసియేషన్ ఓ (ద)శకానికి నాంది పలికింది; తెలుగుతనానికి స్ఫూర్తినిచ్చింది. చెన్నయ్‌లోని వివిధ భాషా పత్రికల్లో పనిచేస్తున్న తెలుగు పత్రికా రచయితలు ఏర్పరచుకున్న 'తేజస్' ప్రత్యేకతలకు మించిన ప్రత్యేకత కలది. ఈ సంఘం 'నాంది' పలికినదీ 'ఆస్కా' (ఆంధ్రా సోషల్ అండు కల్చరల్ అసోసియేషన్)లోనే! ఒక్క దశాబ్దం తరువాత నూట యాబదిమంది సభ్యులతో, ఓ బలమైన ఐరావతమంతటి బలం కలిగి – ఆ 'ఆస్కా'లోని గోదావరీ ప్రాంగణంలో పెద్దపెట్టున దశవర్షక వార్షికోత్సవాన్ని జరుపుకోవడాన్ని తిలకించిన తరువాత, చెన్నయ్ నగరంలో తెలుగు పత్రికా రచయితల వన్నె తరగలేదనీ, లెస్సగా 'మిన్న'యనిపించుకున్నదనీ నా చక్షువుదయానికి తోచింది. 'ఆస్కా'లోని గోదావరి ప్రాంగణ: గలగలా పారే నిండు గోదావరి ప్రవాహపుటలల్లా నిండిపోయింది. వీరికింత జనమందారం ఆంధ్రప్రదేశ్ ప్రధాన నగరాల్లో కూడా ఉండరనిపించింది. నిండు మనం, నిండు పంచెకట్టూ, ఆపైన లాల్చీ, లాల్చీపైన పైకండువాతో, ఒడ్డూపొడుగుల నిండుతనంగా కనిపించే కొణిజేటి రోశయ్య తమిళనాడు గవర్నరుగా ఉండడం, 'తేజస్' దశమ వార్షిక సభలకు అధ్యక్షత వహించడం సభలకో నిండుతనం తెచ్చింది. బిలబిలా కృష్ణమ్మ పరుగుల్లా, సభాపర్వానికి పరువపు పరువు తెచ్చిన 'ఆస్కా' అధ్యక్షుడు కె.సుబ్బారెడ్డి 'తేజస్'కు కొండంత బలిమి కూర్చడం చూస్తూంటే, వేంకటేశ్వర కల్యాణానికి ఆకాశరాజే తరలివచ్చాడా – అన్నట్లు యనిపించింది.

ఆంధ్రప్రదేశ్ నుంచీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ తిరుమలగిరి సురేందర్, సీనియర్ పాత్రికేయుడు వరదాచారి, అంజలీదేవి, ఆదిశేషయ్య, ఆచార్య సి.ఎం.కె. రెడ్డి, కాట్రగడ్డ ప్రసాద్, జె.కె.రెడ్డి, రత్నకుమార్ ప్రభృత ఆస్కా సభ్యులు టంగుటూరి రామకృష్ణ, ఎం.వి. నారాయణగుప్త, గోటేటి శ్రీరామారావు ప్రభృతులెందరో చెన్నయ్, మహానగరవాసులు విచ్చేశారు. సభా సాంప్రదాయం ప్రకారం అన్ని కార్యక్రమాలూ జరిగాయ్. పత్రికా రచయితల సభ్యులు కుటుంబాలతో రావడం చూస్తే, ముందే సంక్రాంతి తొంగిచూచిందా – అనిపించింది. నలభీమ పాకాల వంటి తెలుగు భోజనాన్ని పెట్టి కె.సుబ్బారెడ్డి (ఆస్కా అధ్యక్షుడు) అపరభోజుడు అనిపించారు. ఆనంద్ స్వరమాధురి బృందం ఆనంద స్వరఝురిలో ఉర్రూతలూగించింది. ఏ భాషకైనా, వెలుగు కూర్చేది ఆ భాషా పత్రికా రచయితలే! 'తేజస్' సభ్యులు ఆంగ్ల పత్రికల్లో కూడా పనిచేస్తున్నవారు కావడమొక విశేషం. తేజస్కరమైన 'తేజస్'కు శుభాకాంక్షలు.